J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 13.03.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 41 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# ఖాళీ అవుతున్న 'దేశం'

## టీడీపీ నుండి వైసిపికి వలసల వరస

దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 35ఏళ్ల తన రాజకీయ జీవితంలో దాదాపు 30ఏళ్లు ప్రతిపక్ష నేత పాత్రనే పోషించాడు. తెలుగుదేశంలోనే కాదు, కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వున్నప్పుడు కూడా ప్రజల తరపున పోరాడుతూ ప్రభుత్వాలకు ప్రత్యర్థిగా మారాడు. రాష్ట్ర రాజకీయ చరిత్రపుటలను తిరగేస్తే ఇలా అధికారంలో కంటే ప్రతిపక్షంలో పోరాడిన నాయకులు ఎంతోమంది కనిపిస్తారు. వీళ్లంతా కూడా అధికారంపై మక్కువతో కాకుండా ప్రజల పక్షాన పోరాడడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకనే వారికి అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ఒకటిగానే అనిపించేది.

(మిగతా 10వ పేజీలో)



## జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా ఆనం అరుణమ్మ



10లో

## లాయర్ సారథ్యంలో...

# పుట్టింటి పండుగలా మహిళా దినోత్సవం

నెల్లూరు మహిళాలోకం పులకించింది, ఆనందోత్సాహాలతో పరవశించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే కాదు బహుశా భారతదేశ స్థానిక పత్రికా రంగంలోనే తొలిసారిగా ఒక జిల్లాలోని మహిళలు సాధించిన ఘనవిజయాలతో "సింహపురికి వన్నె తెచ్చిన వనితలు" పేరుతో ఒక చారిత్రాత్మక కాఫీ



అమృతమూర్తి ఉషమ్మకు ఆత్మీయ సత్కారం

టేబుల్ పుస్తకాన్ని 'లాయర్' వారపత్రిక ఆవిష్కరించిన సందర్భానికి సింహపురి మహిళామణులు జేజేలు పలికారు.

వేలాది సంఖ్యలో నెల్లూరు ఆడపడుచులు గొలగమూడిరోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు తరలి వచ్చి లాయర్ సంకల్పాన్ని దీవించారు. పుట్టింటి పండుగలాగా ఈ ఆనంద వేడుకలో పాల్గొన్నారు.

(వివరాలు 3, 6, 7 పేజీలలో)

# నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు!



- రాజ్యసభలో బీసీలకు సగం
- త్యాగానికి బహుమానం

మాట తప్పక పోవడం, మడమ తిప్పకపోవడం అంటే ఇదే! తనను నమ్మిన వారికి న్యాయం చేయడం అంటే ఇదే! తన మాటకు విలువ ఇచ్చి, తనపై నమ్మకముంచి తాను చెప్పీ చెప్పగానే తృణప్రాయంగా మంత్రి పదవులు వదులుకున్న ఇద్దరు నాయకుల విశ్వాసానికి తగిన బహుమానమే ఇచ్చాడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి. శాసనమండలిని రద్దు చేసి తీరాలన్న తన పట్టుదలతో మంత్రి పదవులు కోల్పోయిన పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణలను రాజ్యసభకు ఎంపిక చేయడం ద్వారా వైయస్ జగన్ తనపై వారే కాదు, ప్రజలు పెంచుకున్న నమ్మకాన్ని కూడా నిజం చేశాడు.

త్వరలో రాష్ట్రంలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఎమ్మెల్యేల సంఖ్యా పరంగా చూస్తే ఈ నాలుగు

(మిగతా 10వ పేజీలో)



## కరోనా ప్రత్యేక వార్డును
# పరిశీలించిన సూపరింటెండెంట్

నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వాసుపత్రిలో కరోనా వైరస్ అనుమానితుల కోసం ఏర్పాటు చేసిన 80 పడకల ప్రత్యేక వార్డును ఈనెల 7న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాంబశివరావు, డాక్టర్లతో కలిసి పరిశీలించారు. అనంతరం డాక్టర్లు నర్సింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ఆధునిక వసతులతో ఇటీవల ప్రారంభించిన పల్మనాలజీ డిపార్ట్ మెంట్‌ను కరోనా అనుమానిత రోగుల కోసం కేటాయించామన్నారు. ధుమ్ము, ధూళి లేకుండా శుభ్రపరుస్తున్నామన్నారు. ఎక్స్‌రే, స్కానింగ్ లాంటి సౌకర్యాలను వార్డులోనే కల్పిస్తున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్ అధికారిణి కళారాణి, డాక్టర్లు పాల్గొన్నారు.

# బెగోరె విద్యార్థినుల అన్నదానం

నెల్లూరులోని డా.బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తమ సొంత నిధులతో దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈనెల 9న స్థానిక అయ్యప్పగుడి సమీపంలోని ప్రగతి చారిటీస్‌లో ఉన్న దివ్యాంగులకు ఆత్మీయంగా అన్నదానం చేసి అందరి అభినందనలు అందుకున్నారు. విద్యార్థినులు హాసిని, శ్రీలేఖ తదితరులు మాట్లాడుతూ సేవాభావంతో స్వచ్ఛంధంగా తాము ఈ కార్యక్రమం చేపట్టామని, ఈ సేవ తమకెంతో ఆనందాన్ని సంతృప్తిని కలిగించిందని సంతోషం వ్యక్తం చేశారు.

## రామయ్య బడిలో
# ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు మూలాపేటలోని రామయ్య బడిలో లోటస్ ఆసుపత్రి వైద్యులు ఈనెల 9న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు చేసి వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కీళ్ళు, ఎముకల వ్యాధుల నిపుణుడు మురళీకృష్ణ పాల్గొని రోగులను పరీక్షించి మందులను అందజేశారు. మెప్మా హెల్త్ న్యూట్రిషియన్ స్పెషలిస్ట్ హర్షిత, మాజీ కార్పొరేటర్ పిండి సురేష్, మెప్మా హెచ్ఆర్‌పి సునీత, లోటస్ ఆసుపత్రి పిఆర్ఓ దగ్గుబాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వాకర్స్‌కు సత్కారాలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ లోని మహిళా సభ్యులను ఈనెల 8 న సత్కరించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో తమ ప్రతిభను చూపిస్తూ సమాజంలో మహిళాశక్తి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకునే విధంగా నిరూపిస్తున్నారన్నారు. మహిళల భద్రత కోసం ఏర్పడిన దిశ చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, దిశ యాప్‌ను మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం ఎంతైనా అవసరమని సభ్యులకు సూచించారు. అధ్యక్షులు క్రిష్ణయ్య, కార్యదర్శి శ్రీమన్నారాయణ, కోశాధికారి లక్ష్మీ నారాయణ, మహిళా వాకర్స్ సోనా, ప్రమోలను తగురీతిలో సత్కరించి వారికి జ్ఞాపికలు అందజేశారు. సాయి సుబ్బారావు, నారాయణరెడ్డి, సుబ్బారావు, డాక్టర్ సూర్యనారాయణ, ఖాదర్ బాష, మస్తానయ్య పాల్గొన్నారు.

## కార్పొరేషన్ కమిషనర్‌గా
# బాపిరెడ్డి



నెల్లూరు నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా బాపి రెడ్డిని నియమిం చారు. ప్రస్తుతం ఆయన నుడా వైస్‌ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆత్మకూరు, నాయుడుపేట ఆర్డీవోగా కూడా పని చేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న పివివిఎస్ మూర్తిని అనంతపురం ఆర్డీగా బదిలీ చేశారు. మూర్తి ఇక్కడికి వచ్చి ఏడు నెలలే అయ్యింది. అయితే నెల్లూరు నగరపాలక సంస్థలో ఆరు నెలలకు మించి ఏ కమిషనర్ పని చేయడనే పేరుంది... ఆ సంప్రదాయం కొనసాగిస్తూనే మూర్తి బదిలీ కూడా జరిగిపోయింది.

## 25 నుండి సీనియర్ ప్రొఫెషనల్
# ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ శిక్షణ

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు జిల్లా శాఖ, సెయింట్‌జాన్స్ అంబులెన్స్ న్యూఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 27వ తేదీ వరకు మూడు రోజుల సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ శిక్షణ ఇవ్వబడుతుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై వుండి 18 నుండి 50 సంవత్సరాలలోపు వయస్సు గలవారు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్స్ ఇవ్వబడుతుందని, వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాలని తెలిపారు.

ఆసక్తి గలవారు ఈనెల 24వతేది సాయంత్రం 5 గంటలలోగా జిల్లా ఫీల్డ్ ఆఫీసర్, ఐఆర్‌సీయస్, సెల్ నెంబర్ 83099 66242ను సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

# కరోనాతో జాగ్రత్త
### - డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ పట్ల ప్రజలు ముందు జాగ్రత్తతో ఉండాలని, ఈ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ నెల 9న నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో కరోనా వైరస్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి సోకకుండా తరచూ చేతులను సబ్బుతో కడుక్కోవాలని, తుమ్మినప్పుడు దగ్గినప్పుడు చేతిగుడ్డ అడ్డం పెట్టుకోవాలని, మాస్క్‌ను ధరించాలని సూచించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కెవిఎస్ వర్మ, వార్డెన్ రమణారెడ్డి, డిఇఐసి మేనేజర్ జమీర్, హెల్త్ సూపర్‌వైజర్ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో విశేష పూజలు



గౌరపూర్ణిమ వేడుకల సందర్భంగా నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో బలరామకృష్ణ-సుభద్ర దేవతలకు కన్నుల పండువగా అలంకారాలు నిర్వహించి విశేషపూజలు చేశారు. మందిరం అధ్యక్షుడు డా. సుఖదేవస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

## నెల్లూరు కబుర్లు



# హోళీ... రంగేలి

ఈ నెల 10వ తేదీన నెల్లూరు నగరంలో హోళీ వేడుకలను ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా నివసించే కాపువీధి, మండపాల వీధి, పెద్దబజార్, చిన్నబజార్ ప్రాంతాల్లో యువతీ యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోళీ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

## తిరుపతి పార్లమెంట్ స్థానిక సంస్థల
# ఎన్నికల ఇన్‌ఛార్జిగా మేరిగ

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి ఎన్నికల ఇన్‌ఛార్జిగా గూడూరు వైసిపి నాయకులు మేరిగ మురళిని అధిష్ఠానం నియమించింది. నియోజకవర్గ పరిధిలో వైసిపి విజయానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మేరిగ మురళి పేర్కొన్నాడు.

## పంచాయితీ ఎన్నికలకు
# సర్వం సిద్ధం

నెల్లూరు జిల్లాలో జడ్పీ, పంచాయితీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధంగా వుందని జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు తెలిపారు.

ఈనెల 10న జిల్లా పరిషత్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షను నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో సమీక్షా వివరాలు ప్రకటించారు. జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్ మాట్లాడుతూ జిల్లాలో 832 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఆయా గ్రామాల్లో మళ్ళీ అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సంబంధించి తమ శాఖ అధికారులు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఎవరు ఎక్కడ అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# రెడ్‌క్రాస్ వెబ్‌సైట్ ప్రారంభం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి నెల్లూరు జిల్లాశాఖ నూతన వెబ్‌సైట్‌ను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభిం చారు. ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు కృషి చేసిన రెడ్‌క్రాస్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కార్యకలాపాల పారదర్శకత కోసం నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలి పారు. ఈ వెబ్‌సైట్ ద్వారా రక్త నిల్వ సమాచారాన్ని (లైవ్‌స్టాక్) ప్రజలందరూ తెలుసుకోవచ్చన్నారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ డి.సుధీర్‌నాయుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు యల్‌వి నరసారెడ్డి, యడవల్లి సురేష్, రెడ్‌క్రాస్ రీజనల్ కో-ఆర్డినేటర్ రవికుమార్, డియఫ్ఓ వంశీకృష్ణ, సిస్టం అడ్మిన్స్ టి.శశిధర్, బి.గోపికృష్ణ, బద్రి, లలిత పాల్గొన్నారు.

## తన ప్రాణాలు పోతున్నా...
# ప్రయాణీకుల ప్రాణాలు నిలబెట్టాడు

కళ్ళముందే మృత్యువు కనిపిస్తున్నా ఆ డ్రైవర్ తన మరణం గురించి ఆలోచించలేదు, తన బస్సులో ఉన్న 60మంది ప్రయాణికుల ప్రాణాలకే ప్రాధాన్యత నిచ్చాడు. చాకచక్యంగా బస్సు నిలిపివేసి, తాను మాత్రం తన బ్రతుకు చక్రం లాంటి ఆర్టీసీ స్టీరింగ్ మీద వాలిపోయాడు.

వివరాలలోకి వెళితే.. ఈ నెల 9వ తేదీన రాత్రి నెల్లూరు నుండి బుచ్చికి చివరి బస్సు బయలుదేరింది. డ్రైవర్ ఆదిశేషయ్య బస్సు నడుపుతున్నారు. బస్సు వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ వద్దకు వెళ్లేసరికి ఆదిశేషయ్యకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. అంతటి టెన్షన్ సమయంలోనూ అతను తన గురించి ఆలోచించక, ప్రయాణీకుల ప్రాణాలు నిలబెట్టాలని చూశాడు. వెంటనే బస్సును ఓ పక్కగా నిలిపేసి స్టీరింగ్ మీద అలాగే వాలిపోయాడు. బస్సులో ఉన్న 60 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఆదిశేషయ్య మాత్రం మృత్యువు కౌగిట్లోకి వెళ్ళిపోయాడు. డ్రైవర్ సమయ స్ఫూర్తిని, తన ప్రాణాలు పోతున్నా తమ ప్రాణాలను నిలబెట్టిన ఆయన కర్తవ్యదీక్షను ప్రయాణీకులు కొనియాడారు.

# బెదిరిస్తే... భయపడతామా?
### - అబ్దుల్ అజీజ్



స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తుందని, ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిడిపిలో అభ్యర్థులు లేరని వైకాపా నాయకులు పేర్కొనడం అర్థంలేనిదని మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు.

ఈనెల 9న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తే.. బకాయి బిల్లులు రాకుండా చేస్తామని, అక్రమ కేసులు బనాయిస్తామని వైకాపా నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని, గెలిచిన తర్వాత కూడా డబ్బు, మద్యం పంచారని తేలితే గెలుపు రద్దు చేసి మూడేళ్ళు జైలుకు పంపుతామని భయపెడుతున్నారని, అలాంటివాటికి తాము భయపడేది లేదని అన్నారు. ఇలాంటి దుర్మార్గమైన ప్రజాప్రతినిధులను ఎప్పుడూ చూడలేదన్నారు. అమరావతిలోని 29 గ్రామాలకు, 5 మునిసిపాలిటీలకు ఎన్నికలు లేవని, అక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు జగన్‌కు ధైర్యం లేదని, కేవలం 14 వ ఆర్థికసంఘం నిధులు 3వేల కోట్ల కోసం ఈ ఎన్నికలకు జగన్ హుటాహుటిన తెర లేపారని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో పోటీ లేకుండా ఏకగ్రీవాల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని అన్నారు. టీడీపీకి బీసీలు తొలినుంచి అండగా ఉంటున్నారని వైకాపా ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఇకనైనా ప్రజలు మంచిపాలనకు ఓటేయాలని తాము ప్రజలను కోరతామన్నారు. దమ్ముంటే ఏపీలో లిక్కర్ దుకాణాలను నిలిపేసి ఎన్నికలకు రావాలని ఆయన ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పద్మజాయాదవ్, ఆసిఫ్‌బాషా, పిట్టి సత్యనాగేశ్వరరావు, నన్నేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు' పుస్తకాన్ని అందుకుంటున్న ప్రముఖులు



'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు ప్రభు నుండి పుస్తకాలను అందుకుంటున్న(కుడి నుండి ఎడమకు) రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, కస్తూరిదేవి స్కూల్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి



'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు ప్రభు నుండి పుస్తకాలను అందుకుంటున్న(ఎడమ నుండి కుడికి) మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు వాసూరావు, డిసిసిబి మాజీఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, 'కోరా' విద్యాసంస్థల మాజీడైరెక్టర్ రాజగోపాల్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

### చెన్నై - బెంగుళూరు - కృష్ణపట్నం...

## కారిడార్ పనులు ఎంత దాకా వచ్చాయి


**- రాజ్యసభలో విపిఆర్**



కృష్ణపట్నం పోర్టు అనుసంధానంగా వున్న చెన్నై - బెంగుళూరు కారిడార్ భూసేకరణ పనులు ఎంతవరకు వచ్చాయని ఈ నెల 6వ తేదీన రాజ్యసభలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించాడు. ఈ కారిడార్ కోసం 90శాతం భూసేకరణ పూర్తయ్యింది వాస్తవం కాదా అని ఆయన అడిగాడు. దీనికి కేంద్రమంత్రి పీయుష్ గోయల్ సమాధానమిస్తూ ఈ కారిడార్‌లో మొత్తం మూడు రాష్ట్రాలు(ఆంధ్రా, కర్నాటక, తమిళనాడు) వున్నాయని, ఏపిలో కృష్ణపట్నం, కర్నాటకలో తుముకూరు, తమిళనాడులో పొన్నేరి వద్ద మూడు నోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పాడు. ప్రాజెక్ట్ ప్రస్తుతం అభివృద్ధి దశలో వున్నందున ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని కేంద్రమంత్రి తెలిపాడు. అలాగే గూడూరు - దుగరాజపట్నం రైల్వేలైన్ గురించి సభలో విపిఆర్ ప్రశ్నించగా, ఈ ప్రాజెక్ట్ ఆర్థికంగా లాభదాయకం కానందున ముందుకు తీసుకుపోలేమని కేంద్రమంత్రి పీయుష్ గోయల్ సమాధానమిచ్చారు.

ఇక 11వ తేదీ సభలో జరిగిన చర్చలో విపిఆర్ భవన నిర్మాణ కార్మికుల సామాజిక భద్రత గురించి ప్రశ్నించాడు. 2004-05లో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య 20 మిలియన్లు కాగా, 2018కి 50 మిలియన్‌లకు చేరిందని, వీరి సంక్షేమానికి కేంద్రం ఏం చర్యలు తీసుకుంటోందని ప్రశ్నించాడు. దీనికి కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గన్వర్ సమాధానమిస్తూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారిగా కార్మికుల భద్రతకు, సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించాడు.

## నెల్లూరును వణికిస్తున్న కరోనా



ఎక్కడో చైనాలో పుట్టిన వైరస్ మన నెల్లూరుకి రాదులే అనుకున్నాం... మన దగ్గర ఉన్న ఉష్ణోగ్రతలను ఆ వైరస్ తట్టుకోలేదని ధైర్యంగా ఉన్నాం. కానీ, ప్రపంచంలో వందకుపైగా దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్ ఇప్పుడు నెల్లూరు జిల్లాను కూడా వదల్లేదు. వివరాల్లోకి వెళితే నెల్లూరు జిల్లాకు చెందిన ఏడు మంది విద్యార్థులు చదువుల నిమిత్తం ఇటలీకి వెళ్లారు. అక్కడ కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో ఇటీవల వారంతా తిరిగి ఇండియాకు వచ్చారు. అయితే, చెన్నై ఎయిర్‌పోర్టులో నిర్వహించిన వైద్యపరీక్షల్లో వాళ్ళకి కరోనా వైరస్ వున్నట్లు నిర్ధారణ కాలేదు. దీంతో అక్కడనుండి వాళ్ళను ఇళ్ళకు పంపిచేశారు. అలా వచ్చినవారిలో నెల్లూరు నగర చిన్నబజారుకు చెందిన ఓ విద్యార్థికి ఆ తర్వాత వైరస్ లక్షణాలు బయటపడడంతో హుటాహుటిన పెద్దాసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. స్వాబ్ నమూనాను పూణేకు పంపించారు. ఆ విద్యార్థిలో కరోనా వైరస్ లక్షణాలు ఉన్నట్లు బలంగా విశ్వసిస్తుండడంతో నెల్లూరు నగరమంతా కలవరం రేగుతోంది.

## అక్రమ కాలనీలపై ధ్వజమెత్తిన ఆదాల



దేశంలోని నగరాల్లో అక్రమ కాలనీల కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీ లోక్‌సభలో ప్రశ్నించారు. అక్రమ కాలనీల కట్టడికి తీసుకున్న చర్యలు వివరించాలని ఆయన కోరాడు. దీనికి కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి గురువారం రాత పూర్వకంగా జవాబు చెబుతూ దేశంలోని నగరాల్లో అక్రమ కాలనీల కట్టడికి పలు చర్యలు తీసుకుంటున్నట్లు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో స్థానిక సంస్థలు, అభివృద్ధి సంస్థలతో కలసి ఒక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. నగరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో అక్రమ కాలనీల ఏర్పాటు జరగకుండా ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ(డిడిఎ) చేపట్టిన కొన్ని చర్యలను ఉదహరించారు.

అలాగే 11వ తేదీ జరిగిన చర్చలో ఆయన బొగ్గు నిల్వలపై ప్రశ్నించాడు. దీనికి కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ... మనదేశంలో సమీప భవిష్యత్తులో బొగ్గు నిల్వలకు కొరత ఉండ దని తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ)వారి అంచనాల ప్రకారం దేశంలో 3,26,495 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో 1,607.21 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని కూడా అంచనా వేసిందని, 1950 నుండి 2018- 19 వరకు బొగ్గు నిల్వలు 15,852.57 మిలియన్ టన్నులని, 2018 -19లో కోల్‌ఇండియా లిమిటెడ్ 730.35 టన్నులు ఉత్పత్తి చేసిందని ఆయన పేర్కొన్నాడు.

శ్రీరస్తు! శుభమస్తు!!



శ్రీశ్రీశ్రీ
ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము
తూర్పు కనుపూరు గ్రామం, చిల్లకూరు మం., ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా.
జాతర మహోత్సవ ఆహ్వానము
తేది. 17-3-2020 మంగళవారం నుండి
తేది. 20-3-2020 శుక్రవారం వరకు
కార్యక్రమ వివరములు

జాతర ప్రారంభం
శ్రీ పోలేరమ్మ వారి నిలుపు

| | | |
|---|---|---|
| 17-3-2020 మంగళవారం | ఉ॥ 5.00లకు | శ్రీ అమ్మవారికి దిష్టి తీర్పు |
| | ఉ॥ 6.00 లకు | శ్రీ అమ్మవారికి వెండిచీరతో అలంకారము |
| | సా॥ 5.00లకు | శ్రీ అమ్మవారికి నెమలిచీరతో ప్రత్యేక అలంకారము |
| | సా॥ 7.00లకు | శ్రీ అమ్మవారికి సింహవాహనసేవ |
| 18-3-2020 బుధవారం | సా॥ 6.30లకు | "యార" శ్రీ గురునాథస్వామి, శ్రీ అంకమ్మ దేవతల ఉత్సవము గొల్లల వేడుకలు వివిధ రకములైన పుష్పములతో అమ్మవారికి పూలంగిసేవ |
| 19-3-2020 గురువారం | పగలు | శ్రీ గురునాథస్వామి గ్రామ ఉత్సవము |
| | సా॥6.00లకు | రాత్రి శ్రీ అమ్మవారికి ఉయ్యాలసేవ అమ్మవారికి ముత్యాలచీరతో అలంకారము |
| | రా॥ 7.00లకు | గొప్ప సినీ పాటకచ్చేరి |
| 20-3-2020 శుక్రవారం | ఉదయం 10గం.లకు | శ్రీ పోలేరమ్మను వెళ్ళనంపు ఉత్సవము దున్నపోతుల బహిరంగ వేలం |

ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమములు కలవు
భక్తజన విధేయుడు... కోవూరు జనార్ధన్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి

## 'ప్రభా'తం

భారత దేశ రాజకీయ వ్యవస్థలో ఎన్ని అవలక్షణాలు ఉన్నాయో వాటన్నిటికీ పునాది వేసిన ఘనత కాంగ్రెస్‌పార్టీకే చెందుతుంది. అడ్డదారుల్లో ఎలా అధికారాన్ని చేజిక్కించుకోవాలి, అక్రమ మార్గాల్లో ఎలా ప్రత్యర్థుల ప్రభుత్వాలను కూలగొట్టాలి అనే అరిష్టాలను భారత రాజకీయ వ్యవస్థకు పరిచయం చేసింది కాంగ్రెస్ పార్టీ. వారసత్వ రాజకీయాలకు రాచబాట వేసి, పార్టీలో పని చేసే వారి కంటే భజన చేసే వారికి పెద్దపీట వేసి... పదవులు కావాలంటే పోరాటాలు చేయనవసరం లేదు, మా పాదాల దగ్గర పడి ఉంటే చాలు అని చాటిచెప్పిన ఏకైక పార్టీ కాంగ్రెస్. దాదాపు ఏడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఇదే పోకడలతో సాగింది. ఆ పోకడలను ఆ పార్టీ ఇప్పటికీ విడిచి పెట్టడం లేదు. వాటి మూలంగానే కాంగ్రెస్‌పార్టీ తన సమాధిని తానే అందంగా నిర్మించుకుంటోంది.

కాంగ్రెస్‌లోని వ్యవస్థాగత లోపాలను భారతీయ జనతా పార్టీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది. ఒకప్పుడు ఆయా రాష్ట్రాల్లో ప్రత్యర్థుల ప్రభుత్వాలను కూలదోయడంలో కాంగ్రెస్ ముందుండేది. తమకు అనుకూలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడంలో ఆ పార్టీ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్లు... ఇప్పుడు జాతీయ స్థాయిలో భారతీయ జనతాపార్టీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తోంది. ఇటీవలే కర్ణాటకలో కాంగ్రెస్ మద్దతుతో ఏర్పడ్డ కుమారస్వామి ప్రభుత్వాన్ని కూలదోసి అధికారంలోకి వచ్చిన బీజేపీ, అదే ఊపుతో మధ్యప్రదేశ్‌పై దృష్టి పెట్టింది. తమ లక్ష్య సాధనలో భాగంగా ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కీలక నేతగా ఉన్న జ్యోతిరాదిత్య సింధియాను తమ వలలోకి లాక్కుంది. జ్యోతిరాదిత్యతో పాటు 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీకి రాజీనామా చేయడంతో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడినట్లయింది. జ్యోతిరాదిత్య కాంగ్రెస్‌కు రాజీనామా చేసేసి బీజేపీలో కూడా చేరిపోయాడు. ఆయనను రాజ్యసభ సభ్యుడిగా నియమించి కేంద్ర మంత్రివర్గంలో ఆయనకు స్థానం కల్పించడానికి బిజెపి సిద్ధంగా ఉంది. మిగతా ఎమ్మెల్యేలు అంతా కూడా మధ్యప్రదేశ్‌లో ఏర్పడబోయే బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వబోతున్నారు. మధ్యప్రదేశ్ పరిణామాలను కాంగ్రెస్ స్వయంకృతాపరాధంగా చెప్పుకోవచ్చు. 15 నెలల క్రితమే మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. అప్పటిదాకా మూడు దఫాలు అధికారంలోకి వచ్చిన బీజేపీని కాదని స్వల్ప అసమ్మతి వల్ల మధ్యప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఓట్ల శాతంలో బీజేపీ కంటే కాంగ్రెస్ వెనకబడ్డా కూడా సీట్ల పరంగా రెండు స్థానాలు ఎక్కువ ఉండడం వల్ల బీఎస్పీ మద్దతుతో ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. అయితే రాక రాక ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక, కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన పాత చింతకాయ పచ్చడి వైపే సాగింది. ఆ రాష్ట్రంలో పార్టీని నిలబెట్టడానికి అవిశ్రాంతంగా పోరాడిన జ్యోతిరాదిత్య సింధియాను కాదని పార్టీకి ఏ రకంగానూ ఉపయోగపడని కమల్‌నాథ్‌ను తీసుకొచ్చి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టారు. ఇది జ్యోతిరాదిత్య సింధియా వర్గంలో తీవ్ర అసంతృప్తి రాజేసింది. కానీ అప్పట్లో కాంగ్రెస్‌పార్టీ పట్ల ఉన్న గౌరవంతో జ్యోతిరాదిత్య ఆనాటి పరిణామాలు అంగీకరించాడు. అయితే కాలక్రమంలో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిన కమల్‌నాథ్, దిగ్విజయ్‌సింగ్‌లు తమ వక్రబుద్ధిని బయట పెట్టుకున్నారు. మంత్రివర్గంలో జ్యోతిరాదిత్య వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఆ వర్గంలో అసంతృప్తిని రాజేసింది. అదీగాక కాంగ్రెస్ పరిణామాలు కూడా జ్యోతిరాదిత్యకు మింగుడు పడకుండా వచ్చాయి. కాంగ్రెస్‌లో ఉంటే ఇక భవిష్యత్తు ఉండదనేది ఆయనకు అర్థమైపోయింది. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడడం, పార్టీ అధికారంలోకి వచ్చాక ఢిల్లీలో అధిష్టానానికి భజన చేస్తున్న వాళ్లను తీసుకొచ్చి ముఖ్యమంత్రి పీఠం ఎక్కడం ఆనవాయితీగా మారింది. పదిహేనేళ్ల తర్వాత మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కమల్‌నాథ్‌ను ముఖ్యమంత్రిని చేశారు. మళ్లీ అయిదేళ్ల తర్వాత ఎన్నికలు వస్తాయి. కాంగ్రెస్‌కు అధికారం గ్యారెంటీ లేదు. మళ్లీ బిజెపి అధికారంలోకి వచ్చిందంటే.. ఇంకో 15 ఏళ్లు వాళ్లు కొనసాగే అవకాశం ఉంది. అలాంటప్పుడు జ్యోతిరాదిత్య వంటి యువ నాయకులు తమ భవిష్యత్తు నాశనం చేసుకోవాల్సి ఉంటుంది. అదే బీజేపీ అయితే ఇలాంటి నాయకులకు ప్రోత్సాహం ఉంటుంది. బీజేపీలో తనకు భవిష్యత్తు ఉందని ఆశించాడు కాబట్టే జ్యోతిరాదిత్య ఆ పార్టీలో చేరాడు. మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. రేపు రాజస్థాన్ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. అక్కడ కూడా సచిన్‌పైలెట్ తీవ్ర అసమ్మతితో ఉన్నాడు. మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య లాగే రాజస్థాన్‌లోనూ సచిన్ పైలెట్ కాంగ్రెస్ పురోభివృద్ధికి కృషి చేశాడు. అయితే అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువ నాయకుడు అయిన సచిన్ పైలెట్‌ను కాదని అశోక్ గెహ్లాట్‌కు ముఖ్యమంత్రి పీఠం అప్పగించారు. అక్కడ కూడా కాంగ్రెస్‌పార్టీకి అధికారం దూరం కావడానికి 20 మంది ఎమ్మెల్యేలు అటు ఇటు అయితే చాలు. సచిన్ పైలెట్ ఆ పని చేయగలడు కూడా. మధ్యప్రదేశ్ తర్వాత బిజెపి తన తర్వాత లక్ష్యాన్ని రాజస్థాన్‌పైన గురిపెట్టే అవకాశాలు లేకపోలేదు. ఏదేమైనా ప్రపంచానికి కరోనా వైరస్ సోకినట్లు... కాంగ్రెస్‌కు కూడా పాత విధానాలనే కరోనా వైరస్ సోకింది. ఈ వైరస్‌తోనే ఆ పార్టీ చిక్కి శల్యం కావడం ఖాయం.

### కాంగ్రెస్‌కు కరోనా వైరస్



కాంగ్రెస్‌లోని వ్యవస్థాగత లోపాలను భారతీయ జనతా పార్టీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది. ఒకప్పుడు ఆయా రాష్ట్రాలలో ప్రత్యర్థుల ప్రభుత్వాలను కూలతోయడంలో కాంగ్రెస్ ముందుండేది. తమకు అనుకూలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడంలో ఆ పార్టీ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్లు... ఇప్పుడు జాతీయ స్థాయిలో భారతీయ జనతాపార్టీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తోంది.

## చదువుతోనే మహిళలకు అభ్యున్నతి

- జేసీ-2 కమలకుమారి



చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను చదివించుకోవాలని జేసీ-2 కమలకుమారి అన్నారు. నెల్లూరులోని ఎన్జీఓ హోంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు సాధికారత దిశ వైపు పయనించేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని, మహిళల అభ్యున్నతి కోసం ఉన్న చట్టాలను వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమం అమలులో జాతీయస్థాయిలో మనరాష్ట్రం మొదటిస్థానంలో ఉందని, ఈ కార్యక్రమం జిల్లాలో కూడా పటిష్టంగా అమలుచేస్తున్నామని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.జె సుధ మాట్లాడుతూ మహిళలు ఉచితంగా న్యాయసలహాలు పొందవచ్చని అన్నారు. ఐసిడిఎస్ పి.డి సుధాభారతి, అడిషనల్ ఎస్పీ మనోహర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏ.డి నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముగ్గులు, ఆటల పోటీల్లో విజేతలకు వారు బహుమతులందజేశారు. మెప్మా పి.డి రమేష్, గిరిజన సంక్షేమశాఖ అధికారిణి విద్యారాణి, ఏ.పి.డి శేషుకుమారి, ఐసిపిఎస్ అధికారి సురేష్, డిపిఎం కామాక్షి, కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివజ్యోతిలతో పాటు సిడిపిఓలు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం

విశ్వగాయత్రి పరివార్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న ఎంతో భక్తిశ్రద్ధలతో పంచకుండి గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో 24వేల జప అనుష్ఠానంతో జరిగిన ఈ మహాయజ్ఞంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. మందిరం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, స్వామీ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.




## జగన్ నిర్ణయాలు భేష్

స్థానిక ఎన్నికల్లో డబ్బు, మద్యం నియంత్రించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతైనా అభినందనీయం. ముఖ్యంగా నామినేషన్లకు పోలింగ్‌కు మధ్య పెద్దగా టైం ఇవ్వకపోవడం వల్ల ధనవ్యయాన్ని తగ్గించడానికి ఆస్కారముంటుంది. అలాగే మేయర్, మున్సిపల్ ఛైర్మన్, జడ్పీ ఛైర్మన్, ఎంపిపి వంటి పదవులకు అధిష్టానమే అభ్యర్థులను నిర్ణయిస్తుందని చెప్పడం ద్వారా ఎమ్మెల్యేల స్థాయిలో అవినీతిని అరికట్టినట్లయ్యింది.

**సి.వి.సుజిత్, కలువాయి.**

## వై.వి.కి హ్యాట్సాఫ్

టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తిరుమల పవిత్రతను కాపాడడానికి ప్రాధాన్యతనిస్తూ, అక్కడ అవినీతి ప్రక్షాళనకు గట్టి ప్రయత్నాలు చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డికి అభినందనలు. గత పాలకవర్గం తమ స్వలాభాల కోసం ప్రైవేట్ బ్యాంకుల్లోనూ స్వామివారి నిధులు డిపాజిట్లు చేసింది. 'యస్'బ్యాంకులో లోపాలను పసిగట్టిన టీటీడీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ముందుగానే అప్రమత్తమై ఆ బ్యాంకులో వున్న దాదాపు 1400 కోట్ల టీటీడీ డిపాజిట్లను వెనక్కి తీసుకున్నారు. శ్రీవారి డిపాజిట్లను చిత్తశుద్ధితో కాపాడిన వై.వి.సుబ్బారెడ్డికి హ్యాట్సాఫ్.

**బంకా నారాయణ, నెల్లూరు.**

## ప్రజా కలెక్టర్.. ఇంతియాజ్ అహ్మద్

ఆయన ఒక జిల్లాకు కలెక్టర్. ఆయన అధికారిక పర్యటన అంటే మందీమార్బలంతో జరుగుతుంటుంది. అయితే, ఆయన మాత్రం ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా విజయవాడ నగరంలో వీధివీధి తిరుగుతూ, ప్రతి ఇంటికీ వెళ్ళి, వారి ఇళ్ల ముందున్న అరుగులపై కూర్చుని వారి సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తూ కృష్ణా జిల్లా ప్రజల చేత ప్రశంసలందుకుంటున్నారు. ఆయనే ఇంతియాజ్ అహ్మద్. రాష్ట్రంలోని 13జిల్లాల కలెక్టర్లకు ఆదర్శం ఆయన. మన జిల్లా సంయుక్త కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో కూడా ఇంతియాజ్ పేదప్రజలకు ఎంతగానో సేవచేశారు.

**డా. ఎస్.బాబూరావు, కావలి.**

## ఇది దేనికి సంకేతం!

కూతురి ప్రేమను అంగీకరించలేని తండ్రి... తండ్రి ప్రేమను అర్థం చేసుకోలేకపోయిన కూతురు... వెరసి రెండు ప్రాణాలు బలి. మిర్యాలగూడలో జరిగిన అమృత, ప్రణయ్‌ల ప్రేమ వివాహం మరో విషాదాంతానికి దారితీసింది. అప్పుడు కూతురు కులాంతర వివాహం చేసుకున్నదనే కోపంతో ప్రణయ్ అనే యువకుడిని దారుణంగా హతమార్చారు. ఆ కేసులో ప్రధాన నిందితుడైన అమృత తండ్రి మారుతీరావు మొన్న హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇక్కడ కులం, డబ్బు అనే రెండు భేదాలు ఇద్దరి ప్రాణాలు పోవడానికి కారణమయ్యాయి. అమృత తన తండ్రి ప్రేమను అర్థం చేసుకుని వున్నా ఇలా హత్య, ఆత్మహత్య జరిగేవి కాదు.

**పి.మంజుల, నెల్లూరు.**

## వివాదాస్పదం కానివారిని నియమించండి!

హిందువులు పవిత్రంగా భావించే ఆధ్యాత్మిక క్షేత్రాలకు వివాదాస్పదం కాని వ్యక్తులనే ఛైర్మన్‌లుగా, ధర్మకర్తలుగా నియమించాలి. గతంలో క్రైస్తవ మతాన్ని విశ్వసించే అనితను టిటిడి పాలకమండలిలో సభ్యురాలిగా నియమించి చంద్రబాబు అభాసుపాలయ్యాడు. ఇప్పుడు సింహాచలం దేవస్థానం ఛైర్మన్‌గా నియమించబడ్డ సంచయితపై క్రైస్తవ ముద్ర వుంది. ఆమె వ్యవహార శైలి కూడా వివాదాస్పదంగా వుంది. కాబట్టి ఆమె విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# ముందుకు రాని లీడర్... నిరాశలో క్యాడర్





## మొక్కుబడిగా స్థానిక పోరాటానికి సిద్ధమైన జిల్లా తెలుగుదేశం నాయకత్వం

***జిల్లాలో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. అధికార వైయస్సార్ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న జోరు ప్రతిపక్ష తెలుగుదేశంలో లేకుండా పోయింది. 2019 ఎన్నికల దెబ్బ నుండి ఆ పార్టీ లీడర్, ఆ పార్టీ క్యాడర్ ఇంకా కోలుకున్న సూచనలు కనిపించడం లేదు. కనీసం ఈ ఎన్నికలలో నామమాత్రపు పోటీనిచ్చేందుకు శతవిధాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారి దృష్టి గెలవడం కంటే కూడా అభ్యర్థులను నిలబెట్టడం మీదే వుంది.***

జిల్లాలో 46 జడ్పిటిసిలకు, 541 ఎంపిటిసిలకు అభ్యర్థులను వెతకడం తెలుగుదేశంకి భారంగా మారింది. జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలకు ఎన్నికలు వాయిదా పడడంతో వారికి కొంత ఉపశమనం కల్పించినట్లు అయింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోటీ చేస్తే ఎలా ఉంటుందో తెలుగుదేశం నాయకులు అందరికీ తెలుసు. ఎన్నికలు ఏకపక్షంగా జరిగే అవకాశం ఉంది. ఇంకో నాలుగున్నరేళ్లు వైసిపి అధికారంలో ఉంటుంది. ఈలోపు తెలుగుదేశం తరపున పోటీచేసే దానికి ఎవరూ సాహసించరు. పోటీచేసినా గెలుస్తామనే గ్యారెంటీ లేదు. అదీగాక పోటీలోకి దిగామంటే ఎంత లేదన్నా కోటి రూపాయలు దాకా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలకు అంత ఖర్చు పెట్టుకునే దురద తెలుగుదేశంలో ఎవరికి ఉంటుంది. అయితే కొన్ని స్థానాలలో పోటీ చేయడానికి నాయకులు ముందుకు వచ్చారు. కాకపోతే తమకయ్యే ఖర్చును పార్టీ భరించాలని నిబంధన పెట్టారు. ఇక్కడ ఎన్నికల ఖర్చు ఎవరు పెట్టాలనేది ప్రతిపక్షంలో పెద్ద ప్రశ్నగా మారింది.

మొన్న అసెంబ్లీ ఎన్నికలలోనే ఎమ్మెల్యే అభ్యర్థుల చేతి చిలుం బాగానే వదిలింది. ఇప్పట్లో వాళ్ళు కోలుకునే పరిస్థితి లేదు. ఇక పార్టీ అధిష్టానం కూడా స్థానిక ఎన్నికల కోసం నిధులు పంపే పరిస్థితి లేదు. నిలబడ్డ అభ్యర్థులే ఖర్చుల సంగతి చూసుకోవాలి. కాబట్టే టిడిపి టికెట్లంటేనే ఆ పార్టీ నాయకులు పరుగులు పెడుతున్నారు.

# విపిఆర్‌కు స్థానిక ఎన్నికల బాధ్యత



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల బాధ్యత పెట్టారు. నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు సంబంధించి వైసిపి స్థానిక ఎన్నికల ఇన్‌ఛార్జిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నియమించారు. ప్రభాకర్‌రెడ్డి గతంలోనూ అసెంబ్లీ ఎన్నికలప్పుడు నెల్లూరు జిల్లా, కర్నూలు జిల్లా బాధ్యతలు కూడా చూశాడు. 2012లో జరిగిన ఉప ఎన్నికలకు ఇన్‌ఛార్జిగా ఉన్నాడు. ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తాడనే పేరున్నందువల్లే జగన్ ఈ బాధ్యతను ఆయన భుజాలపై పెట్టాడు.

# ఫ్లై ఓవర్ల కల సాకారమైతేనే... ట్రాఫిక్ కష్టాలు తీరేది

***నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం, ఆక్రమణలు వంటివి ఒక సమస్య అయితే.. ట్రాఫిక్ నరకం అతి పెద్ద సమస్యగా ఉంది. ఇది రోజు రోజుకి పెరుగుతుందే గాని ఏ మాత్రం దారికి రావడం లేదు. ఎస్పీలుగా ఎంత మంది వచ్చి ఎన్ని ప్రయోగాలు చేసినా ట్రాఫిక్ మాత్రం ప్రజలకు నరకం చూపిస్తోంది.***



రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు, తొలగని ఆక్రమణలు, నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్న వాహనాలు ట్రాఫిక్ సమస్యను మరింత జఠిలంగా మారుస్తున్నాయి. అయితే నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఫ్లైఓవర్లు ఎంతైనా అవసరం అన్నది ఎప్పటి నుంచో వినిపిస్తున్న వాదన. 8 లక్షల జనాభా ఉన్న నగరంలో రైల్వే ట్రాక్ దాటడానికి ఒక్క ఫ్లైఓవర్ కూడా లేదు. 4 అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. అయితే వర్షాకాలంలో ఈ బ్రిడ్జిలలో నీళ్లు చేరి ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ఈ సమస్యను అధిగమించడానికి గతంలో కొండాయపాలెం గేట్, బీవీనగర్ ప్రాంతాలలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేశారు. అయితే వాటి ప్రతిపాదన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. తాజా పరిస్థితులలో నగర ఎమ్మెల్యే, మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ నగర ట్రాఫిక్ సమస్యపై కొంచెం సీరియస్‌గానే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆయన నగరంలో రెండు ముఖ్యమైన కూడళ్ళలో ఫ్లైఓవర్ సాధన కోసం శ్రీకారం చుట్టారు.

నగరంలో ట్రాఫిక్ సమస్య అత్యంత జఠిలంగా ఉన్న రామలింగాపురం సెంటర్ మరియు కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ సెంటర్లలో ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాడు. రామలింగాపురం సెంటర్లో జోయాలుకాస్ షోరూం వైపు నుండి జిపిఆర్ కళ్యాణమండపం వరకు మినీ బైపాస్ మీదుగానే ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. దీనివల్ల వీఆర్సీ వైపు నుండి రాకపోకలు సాగించే వాహనాలకు సులువుగా ఉంటుంది. ముత్తుకూరు రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. పలు విద్యా, వైద్య కళాశాలలు ఈ రోడ్లోనే ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టు మరెన్నో పరిశ్రమలకు ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వాహనాల రద్దీ అధికంగా ఉండటం వల్ల ఈ సెంటర్లో ప్రతి రోజు ప్రతి గంట ట్రాఫిక్ సమస్య ఏర్పడుతూనే ఉంటుంది. ఇక్కడ ఫ్లైఓవర్ వస్తే ఆ సమస్యలు చాలావరకు తీరుతాయి.

అదేవిధంగా కెవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్ కూడా ట్రాఫిక్ నరకానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. ఇక్కడ కూడా జిఎన్‌టి రోడ్డు మీదుగా బొల్లినేని ఆసుపత్రి వైపు నుంచి కస్తూరిదేవి స్కూల్ వైపు ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు ఫ్లైఓవర్‌లు వస్తే నగరంలో ట్రాఫిక్ కొంతవరకు తగ్గుతుంది. అలాగే బీవీనగర్ లేదా కొండాయపాలెం గేటు ప్రాంతాలలో ఒక రైల్వే ఓవర్ వంతెన మంజూరు చేస్తే రైల్వేట్రాక్ అటు ఇటు ప్రాంతాలను కలుపుతూ ఒక ప్రధాన మార్గం ఏర్పడుతుంది

# పల్లెల్లో పంచాయతీ పండుగ

చాలాకాలం తర్వాత జిల్లాలోని పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి కనిపిస్తుంది. ఈనెల 27, 29 తేదీలలో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇప్పటికే పంచాయతీ రిజర్వేషన్ల జాబితాను ఖరారు చేశారు. జిల్లాలో 946 పంచాయతీలకు గాను 941 పంచాయతీలలో ఎన్నికలు జరుగనున్నాయి.



అల్లూరు, సింగపేట పాలెం పంచాయతీలకు మాత్రం ఎన్నికలు ఆగాయి. వీటిని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో కోర్టులో పెండింగ్లో ఉన్న కారణంగా ఎన్నికలు నిర్వహించడం లేదు. ఇక 941 పంచాయితీలతోపాటు 8,906 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే పంచాయతీ వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్‌టిలకు 106 స్థానాలు కేటాయించగా వాటిలో మహిళలకు 67, పురుషులకు 39 స్థానాలు కేటాయించారు. ఎస్సీలకు 253 స్థానాలు కేటాయించగా వాటిలో మహిళలకు 133, జనరల్ 120 స్థానాలు కేటాయించారు. బీసీలకు 107 స్థానాలు కేటాయించగా అందులో మహిళలకు 53 స్థానాలు, జనరల్‌కు 54 స్థానాలు కేటాయించారు. ఇక 480 జనరల్ స్థానాలలో మహిళలకు 232 స్థానాలు కేటాయించారు. 248 స్థానాలు జనరల్‌లో ఉంచారు. పంచాయతీ ఎన్నికలలో పార్టీ గుర్తులు లేకపోవడంతో ప్రధానంగా ఎన్నికలు జరుగనున్నాయి. పంచాయతీలలో వైసీపీలోనే వర్గాలు పోటాపోటీగా ఎన్నికల రంగంలోకి దిగుతున్నాయి. ఈ ఎన్నికలలో డబ్బు, మద్యం అనే ప్రస్తావన లేకపోవడంతో గ్రామాల్లో కొంచెం ఎన్నికల సందడి తగ్గినట్లే కనిపిస్తుంది.

# స్థానికంగా సత్తా చాటుతాం - ఆనం



రేపటి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి సత్తాను మరోసారి చాటుతామని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నాడు. ఈనెల 9వ తేదీన వెంకటగిరిలోని రాజాప్యాలస్‌లో వెంకటగిరి రూరల్ దక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి పట్టణ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా కాలం తర్వాత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అభ్యుదయ భావాల కారణంగా మద్యం, నగదు అవసరం లేని స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయని, స్వచ్ఛమైన ఎన్నికలలో ప్రజలు మనవైపే ఉన్నారని చాటాలని అన్నాడు. వైసిపి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అభ్యుదయ భావాలను, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరించి వైసిపి అభ్యర్థుల గెలుపుకు బాటలు వేయాలన్నారు. నవరత్నాల పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని, గత తొమ్మిది నెలల కాలంలో వైసిపి అమల్లోకి తెచ్చిన అమ్మఒడి, రైతు భరోసా, వృత్తి కార్మికులకు నగదు పంపిణీ, ఇళ్ల పట్టాలు, నేతన్న నేస్తం వంటివి ప్రజల్లో ప్రచారం చేయాలన్నాడు. గత ఐదేళ్ల తెలుగుదేశం పార్టీ పాలనను సైతం ఎండగట్టాలని, వారి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే డాక్టర్ వి.సాయికృష్ణ యాచేంద్ర, వి.సర్వజ్ఞయాచేంద్ర, వైసిపి నాయకులు మేరిగ మురళి, కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, దొంతు శారద, ఢిల్లీ బాబు, నక్కా వెంకటేశ్వరరావు, చెలికం శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





## కామేశ్వరమ్మకు 'లాయర్' సన్మానం...

ఈ కార్యక్రమంలో భాగంగా నెల్లూరుకు చెందిన గూడ కామేశ్వరమ్మ అనే 87 ఏళ్ల వృద్ధురాలిని 'లాయర్' ఆధ్వర్యంలో అందరూ ఘనంగా సన్మానించారు. ఎంతోకాలంగా ఆలయాల్లో భక్తిపాటలు పాడుతూ ప్రజల్లో భక్తిభావాలను పెంపొందింపజేస్తున్న కామేశ్వరమ్మను దుశ్శాలువతో, పూలమాలలతో సన్మానించడమే కాక, ఆ భక్తి సంగీత గాయకురాలికి 'లాయర్' తనవంతుగా ఆర్థిక సాయం కూడా అందించింది. ఈ సందర్భంగా కామేశ్వరమ్మ స్వయంగా రాసుకున్న భక్తిగీతాన్ని .. అంతటి వృద్ధాప్యంలోనూ తొణకని బెణకని వీనులవిందైన తన గాత్రంతో అద్భుతంగా గానం చేసి అందరి కరతాళధ్వనులనందుకుంది. ఆ తర్వాత ఆమె ఆశువుగా పద్యరూపంలో అందరికీ ఆశీస్సులందజేయడం ప్రతిఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంది.

## సులోచనమ్మకు 'లాయర్' ఆత్మీయ సత్కారం..

ఎన్ని కష్టనష్టాలెదురైనా అన్నిటినీ అంతులేని ఆత్మవిశ్వాసంతో అధిగమించి, తన కుటుంబాన్ని ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి తీసుకువచ్చిన ఆదర్శమహిళ..మాతృమూర్తి నంబూరు సులోచనమ్మను ఈ మహిళా దినోత్సవం సందర్భంగా 'లాయర్' ఆత్మీయంగా..ఘనంగా సన్మానించింది. గృహిణిగా సులోచనమ్మ తన కుటుంబానికి చేసిన సేవలు అందరికీ మార్గదర్శకమని వక్తలు ఆమెను కొనియాడారు.





### లాయర్ సారథ్యంలో...

# పుట్టింటి పండుగలా మహిళా దినోత్సవం

- మహిళామణులతో క్రిక్కిరిసిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్
- భారత ఉపరాష్ట్రపతి సతీమణి ఉషమ్మకు ఆత్మీయ సత్కారం

'లాయర్' వారపత్రికను ప్రారంభించి ఈ ఏడాది జూన్ 5వ తేదీ నాటికి 39 సంవత్సరాలు పూర్తయి, 40వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మార్చి 8వ తేదీన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది.

ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకురాలు గునుపాటి పింకిరెడ్డి అధ్యక్షత్వంలో జరిగిన ఈ వేడుకలో తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యురాలు, విపిఆర్ ఫౌండేషన్ నిర్వాహకురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సవేరా గ్రూప్ ఆఫ్ హోటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లారెడ్డి నీనరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపా వెంకట్, ప్రఖ్యాత సినీగాయని ఎస్‌పి శైలజ, నార్ ఇన్‌ఫ్రా ప్రై.లి., ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నూకలపాటి పార్వతిరెడ్డి తదితర మహిళామణులు పాల్గొన్న ఈ అపురూప వేదికపై భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి సతీమణి.. అమృత మూర్తి ముప్పవరపు ఉషమ్మకు 'లాయర్' వారపత్రిక తరఫున జరిగిన ఆత్మీయ సన్మానం వైభవోపేతంగా సాగింది.



మార్చి 8, 2020.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇది ఎంతో ప్రతిష్టాత్మకమైన రోజు. నెల్లూరు నేలపై అది ఒక పండుగరోజు. సింహపురి సీమ మహిళామణుల స్ఫూర్తిదీప్తులు మరింత ప్రకాశవంతమైన రోజు. నెల్లూరుసీమలో జన్మించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఖ్యాతినందుకున్న పలువురు మహిళామణులు ఒకే వేదికపైకి వచ్చి 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో అద్వితీయంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో ఎంతో సంతోషంగా పాల్గొన్న అద్భుతమైన రోజు. ఈ వేడుకను పురస్కరించుకుని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి సతీమణి ముప్పవరపు ఉషమ్మను అతిథులందరూ కలసి ఆనందంగా సన్మానించుకున్న రోజు. సింహపురి సీమకు ఖ్యాతి తెచ్చిన ఆణిముత్యాల్లాంటి ఎందరో నారీమణుల ప్రతిభా పాటవాలు, వారి జీవిత విశేషాలతో కూడిన ఓ అద్భుతమైన పుస్తకాన్ని 'కాఫీ టేబుల్ బుక్'గా 'లాయర్' సర్వాంగ సుందరంగా ప్రచురించి 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు' అనే పేరుతో ఆ ప్రత్యేక సంచికను ఘనంగా ఆవిష్కరించిన అపూర్వమైన రోజు. 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి సారథ్యంలో, కార్యక్రమ నిర్వాహకులు తుంగా భారతిరెడ్డి, తుంగా ప్రజిత్‌రెడ్డి, సింధూరరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక.. సింహపురీయులందరికీ నయనానందకరంగా ఉండడమే కాక, ఇంతటి ఘనమైన కార్యక్రమం జరగడం సింహపురి సీమకే గర్వకారణమైంది. అంతేకాక, స్థానిక పత్రికల చరిత్రలోనే.. 'లాయర్' ఈ అపురూపఘట్టాన్ని కనీవినీ ఎరుగని రీతిలో ఆవిష్కరించడం మరో అద్భుతం. 'లాయర్' వారపత్రిక ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ బృహత్తర.. మహత్తర కార్యక్రమం రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలందుకుంది కూడా. ఈ కార్యక్రమం సందర్భంగా విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ పెద్దసంఖ్యలో తరలివచ్చిన సింహపురి మహిళామణులతో, యువతతో... క్రిక్కిరిసిపోయింది.

## మాతాజీ దివ్యాశీస్సులతో.. ఉషమ్మకు ఆత్మీయ సన్మానం...

తమిళనాడుకు చెందిన శ్రీ లలితా మహిళా సమాజం శ్రీ విద్యోపాసకులు యోగినులు శ్రీ విద్యాంబ సరస్వతీ మాతాజీ దివ్యాశీస్సులతో ఉషమ్మకు ఘన సన్మానం జరగడం విశేషం. అనంతరం, నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాధస్వామి దేవాలయ అర్చకులు విచ్చేసి వేదమంత్రోచ్చారణలతో ఉషమ్మకు దైవాశీస్సులు అందజేశారు. మానవసేవే మాధవసేవగా భావిస్తూ ఎంతోమంది జీవితాలకు వెలుగులు ప్రసాదిస్తున్న చల్లని తల్లి.. ఉషమ్మకు జరిగిన ఈ గౌరవ సత్కారం సింహపురిసీమకే గర్వకారణంగా నిలచింది. తొలుత ముఖ్య అతిథులందరూ కలసి జ్యోతిప్రజ్వలనం చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 'లాయర్' ఆధ్వర్యంలో అద్భుతంగా రూపొందించిన 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని శ్రీసిటీ ఎం.డి సన్నారెడ్డి రవిరెడ్డి దంపతులకు, రెండో ప్రతిని నంబూరు మోహన్‌రావు దంపతులకు, మూడవ ప్రతిని పాండిచ్చేరి సీఎం మాజీ సెక్రటరీ వసంతకుమార్‌రెడ్డి సతీమణి పద్మినీ వసంతకుమార్‌కు బహూకరించారు.



## 'ఉమెన్ అసిస్ట్' యాప్ ఆవిష్కరణ

రాష్ట్రప్రభుత్వం రూపొందించిన 'దిశ' చట్టం స్ఫూర్తితో మహిళల రక్షణ కోసం 'గోగాడి' సంస్థ గోగాడి కో-ఫౌండర్స్ ప్రజిత్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డిల సారథ్యంలో రూపొందించిన 'ఉమెన్ అసిస్ట్' యాప్‌ను ఈ సందర్భంగా గునుపాటి పింకిరెడ్డి ఆవిష్కరించారు.









- శివప్రభాత్‌రెడ్డి

## సమాజానికి మహిళలే దీప కాంతులు

సమాజానికి మహిళలే దీప కాంతులని, అన్ని రంగాలలో మహిళలు ముందుంటూ తమ ప్రతిభను చాటుతున్నారని లాయర్ వారపత్రిక సంగ్రాహకులు ప్రభు అన్నారు. తన స్వాగతోపన్యాసంలో ఆయన మాట్లాడుతూ తాను పిలవగానే పెద్ద మనసుతో అంగకరించి మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన అతిథులందరికీ ధన్యవాదాలు తెలిపారు. నిత్యం అత్యంత బిజీగా వుండే పింకీరెడ్డి, నీనరెడ్డి, ప్రశాంతిరెడ్డి, శైలజమ్మ, పార్వతిరెడ్డిలతో పాటు 73 యేళ్ళ వయస్సులో తిరుచ్చి నుండి ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మాతాజీకి, మొదటిసారిగా ఉషమ్మకు సత్కారం చేసే అవకాశాన్ని కలిపించిన దీపమ్మకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ ఉంటుందని, ఈరోజు ఒక సామాన్య వారాలబ్బాయిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఉషాపతి వెంకయ్య వెనుక ఉషమ్మ సహకారం పూర్తిగా ఉందని ప్రభు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'సింహపురికి వన్నె తెచ్చిన మహిళలు' పుస్తకాన్ని కాఫీ టేబుల్‌బుక్‌గా తమ తమ రంగాలలో ఘన విజయం సాధించిన మహిళల విజయగాధలతో రూపొందించామని, తాము చేసిన ఈ ప్రయత్నంలో కొద్దిశాతం సమాచారమే అందించగలిగామని, ఇంకా సేకరించాల్సింది చాలానే ఉందని అన్నారు. లాయర్ 39 సంవత్సరాలు పూర్తి చేసుకుని 40 వ వసంతంలో అడుగు పెడుతున్న ఈ శుభ తరుణంలో నెల్లూరు మహిళలకు ఒక మంచి కార్యక్రమం అందించాలని సంకల్పించినప్పుడు ఎప్పటిలాగే లాయర్ ఏ కార్యక్రమం చేపట్టినా మీ వెనుక మేమున్నాం అంటూ లాయర్‌కు సహకరించిన లాయర్ ఆత్మీయులకు, ఆప్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరగడానికి తమ సహకారాన్ని అందించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టు బోర్డు సభ్యురాలు ప్రశాంతిరెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి అద్భుత కార్యక్రమాన్ని నిర్వహించే అదృష్టం లాయర్ పత్రిక ద్వారా తనకు, తన కుటుంబసభ్యులకు కలగడం తమ అదృష్టంగా ఆయన పేర్కొన్నాడు.



- ప్రశాంతిరెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నెల్లూరులో 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో ఇంత ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషదాయకం. ప్రభు అన్న ఏ కార్యక్రమం నిర్వహించినా ఎంతో విజయవంతంగా చేస్తారు. మహిళా దినోత్సవాన్ని ఇంత అందంగా, ఇంత బాగా చేయడం ఒక్క ప్రభు అన్నకే సాధ్యం. అందులోనూ ఈ కార్యక్రమంలో 87 ఏళ్ల వయసున్న గూడ కామేశ్మరమ్మ అనే వృద్ధురాలిని మనకు పరిచయం చేయడం, ఆమె అంత వృద్ధాప్యంలోనూ ఎంతో బాగా గానం చేయడం..మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. వయసొచ్చింది కదా.. ఇక ఏమీ చేయలేమనే నిరాశాపూరిత ధోరణిలో కాకుండా కామేశ్వరమ్మ స్ఫూర్తిగా.. ఎంత వయసు వచ్చినా ఏదో ఒకటి సాధించవచ్చనేందుకు ఆమె ఒక ఉదాహరణ. కామేశ్వరమ్మ గారిని ఇక్కడ ఈ వేదికపై సన్మానించడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది కూడా. ఎంతోమంది మహిళామణులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం, విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ వేడుక కన్నులపండువగా జరగడం ఆనందంగా ఉంది.



- దీపావెంకట్

నేను, మా అన్నయ్య, మా నాన్నగారు.. అందరం ఈ స్థాయికి వచ్చేందుకు కారణం మా అమ్మ ఉషమ్మ గారే. మా అందరి జీవితాల్లో క్రమశిక్షణతో కూడిన ఉత్సాహం ఇచ్చింది మా అమ్మే. మా అమ్మ ఉషమ్మకు ఈ సందర్భంగా శిరసు వంచి నమస్కరిస్తున్నాను. మా నాన్న గారైన భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు, మా అన్నయ్య హర్షకు, నా భవిష్యత్తుకు..ఇలా మా అందరి ఉజ్వల భవితకు ముఖ్య కారణం మా అమ్మ ఉషమ్మగారే. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని అంటారు. అదేవిధంగా మా నాన్న ముప్పవరపు వెంకయ్యనాయుడి ప్రతి విజయం వెనుక మా అమ్మ ఉషమ్మ ఉన్నారు. మాకంటూ సమాజంలో సమున్నత స్థానం లభించడంలో మా అమ్మ పాత్ర ఎనలేనిది. మా విజయాలకు వెన్నెముక మా అమ్మ ఉషమ్మే. ఇంత గొప్ప తల్లిదండ్రులకు కూతురుగా పుట్టినందుకు ఆ భగవంతునికి కోటి నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను.

ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లాయర్' ప్రభు ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమం జరగడం ఎంతో సంతోషంగా ఉంది.

- నీనరెడ్డి

నేను నెల్లూరులో ప్రసంగించడం ఇదే తొలిసారి. అందుకు అవకాశం కల్పించిన లాయర్ ప్రభుకు నా అభినందనలు. ప్రభు నన్ను ఆహ్వానించడానికి వచ్చినప్పుడు ఆయనలోని నిజాయితీని, సిన్సియారిటీని చూసి నాకెంతో సంతోషం కలిగింది. ఈ వేదికపై ఉన్నవారంతా ఎంతో ప్రముఖులు. ఆయా రంగాల్లో వారెంతో ప్రత్యేకత సాధించిన వారు. నేను ఇక్కడికి వచ్చానంటే నేను ఆరాధించే షిర్డీ సాయిబాబా ఆశీస్సులు, మా తల్లిదండ్రులైన ఊర్మిళమ్మ-సీతారామిరెడ్డి గార్ల చల్లని దీవెనలతోనే. వారిని ఈ సందర్భంగా నేను స్మరించుకుంటున్నాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లాయర్ ప్రభు ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమం జరగడం, ఇంతమంది మహిళలకి ఘనమైన సన్మానాలు చేయడం నాకెంతో ఆనందంగా ఉంది.

- పింకీరెడ్డి

నేను నెల్లూరుకు రావడం నాకెంతో ఆనందంగా ఉంది. నా చిన్నప్పుడు కుటుంబసభ్యులతో కలసి ఇక్కడి పొగతోట వీధుల్లో తిరిగిన రోజులు గుర్తొస్తున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లాయర్' వారపత్రిక అధినేత ప్రభు ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమం జరగడం నాకెంతో ఆనందంగా ఉంది. 1913లో రష్యాలో ప్రారంభమైన అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళా సాధికారత ధ్యేయంగా నేడు అన్ని దేశాల్లోనూ ఘనంగా జరుగుతూ ఉంది. ఎంతో విశిష్టమైన ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ప్రతి మహిళా ధైర్యసాహసాలతో ముందుకు పయనించాలి. అన్ని రంగాల్లోనూ మహిళలు ముందడుగు వేయాలి. ఇలాంటి అపురూపమైన కార్యక్రమం నిర్వహించిన లాయర్ వారపత్రిక అధినేత ప్రభుకి, తుంగా భారతికి, ప్రజీత్‌కి, సింధూరకి.. అందరికీ నా అభినందనలు.





- పార్వతిరెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచురించిన 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు' అనే ప్రత్యేక సంచిక ఒక అద్భుతం. అందులోనూ ఇది అందరినీ ఆకట్టుకునే 'కాఫీ టేబుల్ బుక్'గా ముద్రితం కావడం విశేషం. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవామూర్తి..అమృతమూర్తి అయిన ముప్పవరపు ఉషమ్మ గారిని సత్కరించుకోవడం అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. కుటుంబంలో ఒకరికొకరు మంచి అవగాహనతో, ఆత్మీయమైన బంధాలు అనుబంధాలతో.. అందరూ జీవితాలను ఫలవంతం చేసుకోవాలన్నదే నా ఆకాంక్ష.



- ఎస్పీ శైలజ

'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక ఇంత ఘనంగా జరుగుతుండడం నాకెంతో ఆనందంగా ఉంది. ఉషమ్మ గారికి ఇక్కడ చిరు సత్కారం జరగడం చాలా సమంజసం. ఎందరో ప్రముఖులు పాల్గొన్న ఈ వేదికపై నాకూ ఒక స్థానం లభించిందంటే అందుకు కారణం మా తల్లిదండ్రులే. ఏదేమైనా మనిషి మనుగడకు ఆప్యాయత కావాలి.. శక్తి కావాలి. ఆ రెండింటికీ మూలం మహిళలే. అలాంటి మహిళాశక్తి ఏ కుటుంబంలో ఉంటుందో ఆ ఇల్లు అభివృద్ధితో కళకళలాడుతుంది. ఆ కుటుంబం ద్వారా సమాజం, తద్వారా దేశం సుభిక్షంగా ఉంటాయి. మీ అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

## మా అభివృద్ధికి కారణం అమ్మే... - హర్ష

'మా అభివృద్ధికి కారణం మా అమ్మ ఉషమ్మే. నేను ఈ స్థాయికి వచ్చానంటే అదంతా అమ్మ వల్లే' అని ఉషమ్మ తనయుడు హర్ష ఈ సందర్భంగా అన్నారు. ఉషమ్మ కుమారునిగా నేనెంతో గర్వపడుతున్నానని అన్నారు.

అనంతరం, ఉషమ్మ కోడలు రాధమ్మ మాట్లాడుతూ, మా అత్తమ్మ ఒక్క దీపమ్మకే కాదు.. మా అందరికీ అమ్మేనంటూ మురిసిపోయారు. మా మామయ్యగారు, అత్తమ్మ ఇద్దరూ తనను ఒక కూతురు లాగా ఎంతో బాగా చూసుకుంటున్నారని, జన్మ జన్మలకీ అత్తమ్మే నాకు అమ్మ కూడా అనీ ఆమె ఎంతో సంతోషంగా చెప్పారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని శ్రీ గురుకృప కళాక్షేత్రం అధినేత్రి గాయత్రి ఆధ్వర్యంలో ప్రదర్శించిన భరతనాట్యం, కథక్, జుగల్బందీ కార్యక్రమాలు ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నాయి. ఈ నాట్యవిభావరిలో కళాంజలి, ఉమా భాగ్యశ్రీ, గౌరీ మానస, వాత్సల్య, సాయిప్రీతి, చరిత, శ్రీదేవి, సుహర్షిణి, మోక్షప్రదలు ప్రదర్శించిన నాట్య విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదే సందర్భంలో వీణాత్రయం హేమలక్ష్మి, పద్మా చక్రవర్తి, నాగలక్ష్మిల వీణానాదం అందరికీ వీనులవిందు చేసింది. వీరికి శాంతికుమార్ తబలా వాయిద్యంపై సహకరించారు.

## కళ్యాణ వైభవం...!




నెల్లూరు ట్రంకురోడ్డులోని 'రైతు డిపో' అధినేత వీరిశెట్టి సుధాకర్ - విజయకుమారిల కుమార్తె మౌనిక - రఘునాథ్ (తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం వాస్తవ్యులు కురిమెళ్ల వెంకటయ్య - రాజేశ్వరిల కుమారుడు)ల వివాహ రిసెప్షన్ వేడుక 5వ తేదీ నెల్లూరులోని హోటల్ మినర్వగ్రాండ్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# సీఎం జగన్ నిర్ణయం.. సాహసోపేతం

ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీ జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించి ఎన్నికలకు దిగడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయమని, సిఎం నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, జౌళి, వాణిజ్య, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. ఈనెల9న ఆయన ఆత్మకూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక రవితేజ కళ్యాణమండపంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి గౌతం మాట్లాడుతూ మన రాష్ట్రం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ఇప్పటికే ఇతర రాష్ట్రాల సిఎంలు ఆదర్శంగా తీసుకున్నారని, ఆ పథకాలు కేంద్రం ప్రశంసలను కూడా అందుకుంటున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ అభ్యర్థులను, మద్దతుదారులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు 34 శాతం బీసీల రిజర్వేషన్లు అమలుచేసేందుకు ఓసీలు త్యాగం చేయాల్సి ఉందన్నారు. పార్టీని నమ్ముకొన్న కార్యకర్తలకు వైకాపాలో ఎప్పుడూ అన్యాయం జరగదని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, రాపూరు వెంకటసుబ్బారెడ్డి, పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, కంటాబత్తిన రఘునాథరెడ్డి, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, చిట్టమూరు జితేంద్రనాథ్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు

**- సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**



స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. చిల్లకూరులోని మండల కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ల కేంద్రాన్ని ఆయన ఈనెల 9న సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. గూడూరు డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, గత సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసులు అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని తెలిపారు. నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థుల కోసం సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాగా, పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని సిఐలతో సమీక్షా సమావేశాన్ని డిఎస్పీ శ్రీభవానిహర్షతో కలసి నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

### టీడీపీ తిరుపతి లోక్‌సభ స్థానిక ఎన్నికల పరిశీలకురాలిగా

## తాళ్ళపాక అనూరాధ



తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ నియమితులయ్యారు. ఈనెల 10న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నుండి ఆదేశాలందాయి. గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలలో టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

## వృద్ధాశ్రమానికి స్టీలు బిందెల వితరణ




గూడూరు గమళ్ళపాళెంలో ఉన్న సాయిరాం వృద్ధులు, దివ్యాంగుల ఆశ్రమంలో శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, అంతర్జాతీయ మానవ హక్కులు, నేర వ్యతిరేక సేవాసంస్థ రాష్ట్ర కార్యదర్శి (మయూరి శ్యాంయాదవ్) బి. శ్యామసుందరరావు ఆధ్వర్యంలో ఆశ్రమం వారికి స్టీలు బిందెలు వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన తల్లి వనమ్మ, సతీమణి మహేశ్వరితో పాటు ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# పురపాలక సంఘ ఎన్నికలు లేనట్లే!




గూడూరు పురపాలక సంఘం ఏర్పడినప్పటి నుంచి గత ఎన్నికల వరకు క్రమం తప్పకుండా ఎన్నికలు జరిగాయి. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గూడూరు పురపాలక సంఘానికి ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదని ఉన్నతాధికారులు ఈనెల 9న తేల్చేశారు. మూడు నెలల క్రితం గూడూరు పురపాలకసంఘాన్ని గ్రేడ్-1 చేయడంతో పాటు గూడూరు పరిసర ప్రాంతాలైన చిల్లకూరు, పోటుపాళెం, నెల్లటూరు, దివిపాళెం, చెన్నూరు మొదలగువాటిని విలీనం చేశారు. అప్పటివరకు బాగానే ఉంది. అయితే, చిల్లకూరు, పోటుపాళెం పంచాయతీలకు చెందిన పలువురు కోర్టును ఆశ్రయించి స్టే పొందారు. పురపాలకసంఘంలో విలీనం చేయడంతో ప్రజలు అన్ని విధాలుగా నష్టపోతారని, ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా ఏకపక్షంగా విలీనం చేయడంపై వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా పురపాలక సంఘం ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

# స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గంలో అత్యధిక స్థానాలు వైకాపా గెలుపొందేలా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈనెల 9న గూడూరులోని వైకాపా కార్యాలయంలో వైకాపా తిరుపతి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు మేరిగ మురళీధర్‌తో కలసి ఆయన నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై వారు చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మల్లు విజయకుమార్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు ఆంధ్ర మహిళామండలి సన్మానం



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ సి.రోహిణి, క్లబ్ సభ్యులు

ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని ద్వారకామయి ఫంక్షన్ హాలులో ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు స్ఫూర్తి నింపేలా అనేకరంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించిన మహిళామణుల చిత్రపటాలతో అలంకరించిన వేదిక అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ విపిఆర్ ఫౌండేషన్ తరపున ఆంధ్రమహిళా మండలి కార్యక్రమాలకు తనవంతు సహాయం అందజేస్తామన్నారు. డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలరని అన్నారు. అనంతరం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, గూడూరు తహశీల్దార్ లీలారాణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షులు ఇంద్రసేనమ్మ, మల్లాబత్తిన జీవనరెడ్డి, డాక్టర్ సి. జనార్ధన్‌రెడ్డి, జానకి రామిరెడ్డి, మునిగిరీష్, రామకృష్ణారెడ్డి, డి.సురేష్, ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి దేగా సుప్రియ, సుగంధిని, ప్రభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఆర్‌డబ్ల్యు కళాశాలలో మహిళా దినోత్సవం



డాక్టర్ సి.రోహిణిని సత్కరిస్తున్న న్యాయమూర్తి గాయత్రి, పక్కన జేవీవీ ప్రతినిధి వి.రాజేంద్రప్రసాద్ తదితరులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణించడం సంతోషకరమన్నారు. కోర్టులు, పోలీస్‌స్టేషన్‌లంటే భయం విడనాడాలని, న్యాయం కోసం ధైర్యంగా పోరాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణిని ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ భారతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కళాశాలలో జేవివి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

● ఇంటి వద్దకే రేషన్ బియ్యం

# ఏప్రిల్ 1 విడుదల



➢ తొలి విడతగా లక్ష మందికి పంపిణీ

➢ ఆ తర్వాత దశలవారీగా జిల్లాకంతటికీ

*అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రేషన్‌బియ్యం..ఏప్రిల్ 1వ తేది నుంచి నేరుగా లబ్దిదారుల ఇళ్ళ వద్దకే చేరనున్నాయి. అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ కొంతకాలంగా యంత్రాంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ప్రభుత్వ పథకాలను ఇళ్ళ ముంగిళ్లకే చేర్చేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీంతో రేషన్‌కార్డుదారులు రేషన్‌షాపుల వద్దకు వెళ్ళి గంటలతరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఇక ఉండదు.*

ఏప్రిల్ 1వతేది నుండి రేషన్‌బియ్యాన్ని డోర్ డెలివరీ చేసేందుకు జిల్లా ఉన్నతాధి కారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా గూడూరు నియోజక వర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. నాణ్యమైన బియ్యాన్ని లబ్దిదారులకు పం పిణీ చేసేందుకు గూడూరులోనే ప్రయో గాత్మకంగా ప్యాకింగ్‌యూనిట్‌ను కూడా నెలకొల్పి, తొలివిడతగా 5 మండలాల్లో లక్షమంది లబ్దిదారులకు గ్రామ సచివా లయాల వాలంటీర్ల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ ఏర్పాటు చేయాలని అధికారులు కొద్ది నెలలుగా కృషి చేస్తున్నారు. నాణ్యమైన బియ్యాన్ని ప్యాకెట్ల రూపంలో డోర్ డెలివరీ చేసేం దుకు సిద్ధమవుతున్నారు.

గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లోని 1,00,094 రేషన్ కార్డుదారులకు తొలివిడతగా రేషన్ బియ్యాన్ని ప్యాకెట్ల రూపంలో అందజేయ నున్నారు. ఏప్రిల్ 1 నుంచి వాలంటీర్లు చౌకదుకాణాల డీలర్ల నుంచి ఆ బియ్యం ప్యాకెట్లను తీసుకుని కార్డుదారుల ఇంటిం టికి వెళ్ళి వాటిని పంపిణీ చేయనున్నారు. మూడురోజుల్లోగా వాలంటీర్లు వాటిని పంపిణీచేయాల్సి ఉంది. ఆ సమయానికి ఇళ్ళ వద్ద అందుబాటులో లేకపోవడం, లేదా వలంటీర్ల నుంచి బియ్యం తీసుకోలేక పోయిన కార్డుదారులు ప్రతి నెలా 10వ తేది నుంచి 15వతేదీ లోపు చౌకదుకా ణానికి వెళ్ళి రేషన్ బియ్యం తీసుకునేం దుకు కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

అదేవిధంగా ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులను ప్రభుత్వం మార్పు చేసి, వాటికి బదులుగా బియ్యం కార్డులుగా పేరు మార్పి కార్డుదారులకు ఆ మేరకు ఎక్కువ కాలం భద్రంగా ఉండేలా సింథటిక్ కార్డులు అందజేయనుండడం విశేషం. జిల్లాలో 9.04 లక్షల మంది రేషన్‌కార్డు దారులు ఉన్నారు. ఇందులో అర్హత కలిగిన 7.49 లక్షల మందికి బియ్యం కార్డులు అంద జేయనున్నారని తెలుస్తోంది.

## చెంగాళమ్మ దేవాలయంలో చండీయాగం

మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూళ్ళూరుపేటలో కొలువై ఉన్న శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఎంతో వైభవంగా చండీయాగం నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉన్న యాగశాలలో అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపు చేసి శోభాయమానంగా అలంకరించి, గోపూజ తదితర విశిష్టపూజలు చేసిన అనంతరం భక్తిశ్రద్ధలతో చండీయాగం చేశారు. నెల్లూరు ఇసుకపాలెనికి చెందిన పెళ్ళూరు శ్రీనివాసులురెడ్డి-ప్రసన్న దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి ఈ వేడుకలను పర్యవేక్షించారు.

ఎన్నికల నిర్వహణకు...

# అందరూ సహకరించాలి

**జడ్పీ ఎన్నికల అధికారి బాపిరెడ్డి**

జిల్లాలో జరిగే జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని జడ్పీ ఎన్నికల అధికారి బాపిరెడ్డి, జడ్పీ సిఇఓ పి.సుశీల ఈనెల 8న జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో పార్టీల నాయకులందరినీ కోరారు. ప్రధాన పార్టీల నేతల్లో అందుబాటులో ఉన్నవారితో వారు సమావేశం నిర్వహించారు. ఈనెల 9 నుంచి ప్రారంభమైన నామినేషన్ల కార్యక్రమానికి పార్టీల పరంగా అనుసరించాల్సిన నియమాలను, పోటీచేసే అభ్యర్థులు నిబంధనల మేరకు అనుసరించాల్సిన విషయాలను వారు వివరించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చే ఆదేశాల ప్రకారమే జిల్లా అధికారులు పనిచేస్తారని, అందుకు పార్టీలవారంతా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నిరంజన్‌రెడ్డి (వైకాపా), చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మనోహర్‌రెడ్డి (తెదేపా) శ్రీరాములు, దయాకర్ (సిపిఎం), పి.శ్రీనివాస్ (బహుజన సమాజ్ పార్టీ) తదితరులు హాజరయ్యారు.

## వినూతకు 'ఉత్తమ మహిళా రైతు' అవార్డు

పలురకాల పండ్లమొక్కల పెంపకంలో ప్రతిభ చూపిన చేజర్ల మండలం కాకివాయి గ్రామానికి చెందిన మహిళా రైతు దగ్గుపాటి వినూతకు 'ఉత్తమ మహిళా రైతు' అవార్డునిచ్చి ఘనంగా సత్కరించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వినూతకు ప్రశంసా పత్రం బహూకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త బి.గోవిందరాజులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మేలురకం ఉద్యాన మొక్కలు, పోషక వనాల పెంపకంలో ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.

## ఖైదీలు క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకోవాలి

ఖైదీల క్రమశిక్షణతో శిక్షణ పూర్తిచేసుకోవాలని జైళ్ళశాఖ ఐజీ బి.జయవర్ధన్ సూచిం చారు. ఈనెల7న నెల్లూరుజిల్లా చెముదుగుంటలోని జిల్లా కేంద్ర కారాగారాన్ని ఆయన తనిఖీ చేసి, వయోజన విద్యాకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళా ఖైదీలతో సమావేశమై వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మూలాపేటలోని ఏపీ స్టార్స్ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎం.ఆర్. రవికిరణ్, ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

'దోమలపై దండయాత్ర' సీక్వెల్...

# "కరోనాపై కత్తియుద్ధం" ప్రకటించిన చంద్రబాబు

*అది కాకులు దూరని కారడవి... చీమలు నడవలేని చిట్టడవి... అలాంటి అడవిలో యువవిశ్వభీభత్స నారా లోకేష్ నడుచుకుంటూ పోతున్నాడు... అంతలో ఆకాశంలో నుండి ఒక అరుపు... నాయనా, లోకేష్... ఒక్క నిముషం అక్కడే ఆగు... ముందున్న ఆ చెట్టు క్రిందకు పోవద్దు అని హెచ్చరిక... ఆ కేక ఎవరిదా అని లోకేష్ చుట్టూ చూశాడు... ఎవరూ కనిపించలేదు. సరే, ఎందుకైనా మంచిదని లోకేష్ అక్కడే ఆగాడు. అంతలో పెద్ద శబ్దంతో ఆకాశం నుండి పిడుగుపడి ఆ చెట్టు కాలిపోసాగింది. లోకేష్ అప్పుడు మనసులో... హమయ్యా, ఆ పిలుపుకు ఆగిపోవడమే మంచిదయ్యింది, లేకుంటే ఈ రాష్ట్రం ఏమయ్యుండేది అని అను కున్నాడు. తర్వాత మళ్ళీ నడక మొదలు పెట్టాడు. కొద్దిదూరం వెళ్లాక మళ్లీ ఆకాశం నుండి సందేశం... లోకేష్ స్టాప్ అని... లోకేష్ ఆగాడు.... ఒక పెద్ద అనకొండ ఒక జింకను తరుముకుంటూ అటు వెళ్లింది. లోకేష్ గుండె గుభేల్ మంది. ఆగడం మంచిదైందనుకుని మళ్ళీ నడవ సాగాడు. బాగా నడవడంతో ఆక లేయసాగింది. ఈ సమయంలో కడుపుకు అంత పప్పు అన్నం దొరికితే బాగుండని అనుకున్నాడు. అతను అనుకున్నదే తడవు దూరంగా చెట్టుక్రింద ఓ అరటి ఆకులో వడ్డించిన పప్పు, అన్నం, స్వీటు, వడ కనిపించాయి. లోకేష్ ఆబగా వాటి దగ్గరకు పోబోయాడు. అప్పుడు ఆకా శంలో నుండి... నాయనా లోకేష్ వాటిని తినొద్దు అనే హెచ్చరిక... కాని, లోకేష్.. నువ్వు ఏం చెప్పినా వింటాను, ఈ విష యంలో మాత్రం నా మాట నేనే వినను అని గట్టిగా అరచి చెప్పాడు. ఆయన అలా అంటుండగానే ఒక అడవిపంది వచ్చి అక్కడున్న ఆహారాన్ని తినేసింది... అలా తిన్న కొన్ని క్షణాలకే అది నురగలు కక్కుతూ చనిపోయింది. ఆ దృశ్యం చూసి లోకేష్‌కు ముచ్చెమటలు పట్టాయి. లోకేష్ ఆకాశం వైపు కృతజ్ఞతగా చూస్తూ... నా ప్రాణాలు కాపాడావు, ఇంతకీ ఎవరు మీరు అని గట్టిగా అడిగాడు. అప్పుడు ఆకాశం నుండి... నేను అదృశ్యవాణిని, అనుక్షణం మీ వెంట వుండి మిమ్మల్ని కాపాడమని స్వర్గలోకం నుండి మీ తాత నందమూరి తారకరామారావు పంపారు అని చెప్పింది. అప్పుడు లోకేష్ కోపంగా.... మరి అనుక్షణం నన్ను కాపాడేదానివైతే... నేను మంగళగిరిలో పోటీ చేస్తున్నప్పుడు నన్ను ఓడిపోతావని ఎందుకు హెచ్చరించలేదని అడిగాడు. అందుకు అదృశ్యవాణి... మీరు మంగళ గిరి నుండి పోటీ చేస్తే ఓడిపోతారని నాకు తెలుసు... కాని మీరు మందలగిరి నుండి పోటీ చేస్తున్నాను అని చెబుతుంటే, అది ఇంకో నియోజకవర్గమేమోననుకున్నా... అందుకే హెచ్చరించలేకపోయా అని అదృశ్యవాణి పలికింది. దానికి లోకేష్... నీకు వెటకారం ఎక్కువైంది... నీ పని చెబుతా వుండు... అంటూ అక్కడే వున్న రాయిని తీసుకుని అదృశ్యవాణి వైపు విసిరాడు. ఆ రాయి విసరడంతోనే భళ్లున సౌండ్ వచ్చింది. ఆ సౌండ్ దెబ్బకు నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలు పరుగెత్తుకుంటూ వచ్చారు... మంచం మీద పడుకుని చేతికి ఏది దొరికితే అది విసురుతున్న లోకేష్ ముఖంపై నీళ్ళు కొట్టారు. లోకేష్ కళ్ళు తెరచి బిత్తర చూపులు చూడసాగాడు. ఏమైందిరా అని భువనేశ్వరిదేవి ఆతృతగా అడిగింది. తనకు అప్పగించిన డ్యూటీని అదృశ్యవాణి సక్రమంగా నిర్వర్తించలేదమ్మా, అందుకే దానిని రాయితో కొట్టాను అని లోకేష్ అన్నాడు. అందుకు భువనేశ్వరీదేవి... లోకేషా... నువ్వు రాయి విసిరింది అదృశ్యవాణి మీద కాదు... రాయి అనుకుని నీ సెల్‌ఫోన్‌ను తీసి అద్దం మీదకు విసిరావు... అది పగిలింది అని చెప్పింది. అప్పటికి గాని అర్థం కాలేదు లోకేష్‌కు అప్పటిదాకా తనకొచ్చింది కల అని... లోకేష్ మంచం మీద నుండి లేచి నాన్న ఎక్కడున్నాడమ్మా అని అడిగాడు. ఇంకా నిద్ర లేవలేదు అని భువనేశ్వరి చెప్పింది. సరేలే... అలాగైతే నేను ఆయన లేచిన తర్వాతే లేస్తాను అంటూ మంచం మీద వాలి ముసుగుతన్నాడు.*

★★★★★

*హైటెక్ రత్న చంద్రబాబు నిద్రలేచి ముఖం కడుక్కుని హాల్‌లోకి వచ్చాడు. అంతే అక్కడున్న వారిని చూసి ఆయన కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అక్కడ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్, రష్యా ప్రధాని వ్లాదిమర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు ఆయుతుల్లా ఖోమైని, ఫ్రాన్స్ అధ్యక్షుడు నికొలస్, జర్మనీ ఛాన్సలర్ ఏంజల్ మోర్కెలా, జపాన్ ప్రధాని షింజో అబే, ఇంకా పలు దేశాల ప్రతినిధులు వున్నారు. చంద్రబాబును చూడగానే వాళ్లంతా గౌరవంగా లేచి నిలబడి రెండు చేతులెత్తి నమస్కరించారు. చంద్రబాబు వారికి ప్రతి నమస్కారం చేసి, అందరినీ కూర్చోమని చెప్పి కాఫీలు తెప్పించాడు. అందరూ కాఫీ తాగాక చంద్రబాబు వారితో... ఇప్పుడు చెప్పండి ఎందుకు మీరంతా కట్టకట్టుకుని వచ్చారని అడిగాడు. అప్పుడు జిన్‌పింగ్ చంద్ర బాబు రెండు చేతులు పట్టుకోబోయి మళ్ళీ ఏదో గుర్తొచ్చి.. రెండు చేతులు జోడిస్తూ.. మహానుభావా, ఈ ప్రపంచాన్ని మీరే కాపాడాలి అని వేడుకున్నాడు. ప్రపంచాన్ని నేను కాపాడడమేమిటి... అసలు దేని నుండి కాపాడాలి అని చంద్రబాబు అడి గాడు. కరోనా వైరస్ నుండి... దాని బారిన పడి ప్రపంచ దేశాలన్నీ వణికి పోతున్నాయి, వేలాదిమంది చనిపోతు న్నారు, శాస్త్రవేత్తలు ఎంతగా పరిశో ధనలు చేసినా దానికి మందులు కనిపెట్ట లేకపోతున్నారు. ఇక ఆ వైరస్‌ను తుద ముట్టించగల శక్తిసామర్థ్యాలు మీకే వున్నా యని డొనాల్డ్ ట్రంప్ అన్నాడు. చంద్ర బాబు మొహమాటంగా... దాని గురించి నాకేం తెలుసు అని అంటుండగా... వెంటనే బ్రిటన్ ప్రధాని థెరిస్సామే కలుగజేసుకుని... అంతా మీకే తెలుసు, కంప్యూటర్‌ను కనిపెట్టింది మీరే, సెల్ ఫోన్ల సృష్టికర్త మీరే, ప్రపంచంలోని అన్ని మేటి సిటీలను వడబోసి అమరావతి అనే ఒక సిటీని చూపింది మీరే... సచిన్‌కు క్రికెట్ నేర్పింది, సింధుకు బ్యాడ్మింటన్ నేర్పింది మీరే... అలాంటి మీకు కరోనా వైరస్‌ను ఎలా నిర్మూలిం చాలో తెలియదంటే మేము నమ్మాలా...? అని అంది. అప్పుడు చంద్రబాబు వారం దరితో... ఓకే ఓకే... మీ బాధ నాకు అర్థమైంది. నేను మొన్న ఏపి సీఎంగా పనిచేసిన కాలంలో దోమలను నిర్మూ లించడానికి 'దోమలపై దండయాత్ర' అనే కార్యక్రమం పెట్టుకున్నాను... ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన కరోనా వైరస్‌ను తుదముట్టించడానికి 'కరోనాపై కత్తియుద్ధం' కార్యక్రమాన్ని ప్రకటిస్తు న్నాను... నా కత్తి దెబ్బకు కరోనా పారి పోవాలి... "కరోనా కాసుకో" అంటూ పెద్దగా కేకలు వేయసాగాడు... అప్పుడే ముఖం మీద చినుకులు పడినట్లుండ డంతో చంద్రబాబు టక్కున కళ్ళు తెరి చాడు. ఆయన మంచం మీదే వున్నాడు... ఎదురుగా భువనేశ్వరీదేవి, బ్రాహ్మణిలు వున్నారు. ఏమైంది అని చంద్రబాబు అడిగాడు. మీరు 'కాసుకో కరోనా' అని నిద్రలో కేకలు వేస్తుంటే నీళ్ళు తెచ్చి ముఖాన చల్లాను అని భువనేశ్వరీ దేవి అంది. అప్పటికి గాని అర్థం కాలేదు చంద్రబాబుకు అప్పటివరకు తనకు వచ్చింది కల అని. ఆ కల గురించే చంద్రబాబు భువనేశ్వరీదేవికి చెప్పాడు. అంతా విన్న ఆమె... బాగానే వుంది మీ తండ్రీ కొడుకుల వరుస... అధికారం కోల్పోయి ఖాళీగా వుండేసరికి చెరొక బెడ్రూంలో పడుకుని తీరిగ్గా కలలు కంటున్నారు... ఈ కలలు కనేబదులు అమరావతి ఉద్యమం అంటూ జనాల్లోకి వెళ్లి జోలెపట్టొచ్చు కదా అని సనుగుతూ ఆమె వంటింట్లోకి వెళ్లింది.*

# నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు!

(మొదటి పేజీ తరువాయి)

స్థానాలు కూడా వైసిపి ఖాతాలో జమ పడడం ఖాయం. ఈ నాలుగింటిలో రెండింటిని బి.సి వర్గాలకు చెంది, తమ మంత్రి పదవులను వదులుకున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణలకిచ్చారు. ఇక దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితులుగా వుంటూ, వైసిపి పెట్టినప్పటి నుండి కూడా జగన్‌కు అన్ని విధాలా అండదండగా వున్న అయోధ్య రామిరెడ్డికి రాజ్యసభలో స్థానం కల్పించారు. అలాగే రాష్ట్రంలో పెట్టుబడుల కోణంలో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కోరిక మేరకు ఆ కంపెనీ ప్రతినిధి పరిమళ్ నత్వానీకి నాలుగో సీటు కేటాయించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, అలాగే కేంద్ర ప్రభుత్వంతో వున్న సన్నిహిత సంబంధాల దృష్ట్యా ఈ నాలుగో సీటును పారిశ్రామికవేత్త నత్వానికి కేటాయించినట్లు తెలుస్తోంది.

## కాలధర్మం

### కందలి పెంచలరెడ్డి



కాంగ్రెస్‌వాది, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు గూడూరు సమితి మాజీ అధ్యక్షుడు కందలి పెంచలరెడ్డి తన 85వ యేట ఈ నెల 9వ తేదీన స్వర్గస్తులైనారు. ఆయనకు భార్య సులోచన వున్నారు. పిల్లలు లేరు. ఒంగోలు రవాణాశాఖాధికారి అల్లూరు చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన మేనమామ అవుతారు. గూడూరు మండలంలోని తిప్పవరప్పాడు ఆయన స్వగ్రామం. ఆ గ్రామానికి ఆయన 20ఏళ్ళ పాటు సర్పంచ్‌గా పనిచేశారు. అలాగే ఆయన సతీమణి సులోచనమ్మ కూడా 5ఏళ్ల పాటు గ్రామసర్పంచ్‌గా సేవలందించారు. తమ పదవీకాలంలోనే వాళ్ళు గ్రామంలో ప్రజల నుండి పన్నులు కట్టించుకోకుండానే తమ సొంత డబ్బుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 1972లో తమ తండ్రి స్వర్గీయ కందలి వెంకటసుబ్బారెడ్డి పేరుతో తమ డబ్బుతోనే ప్రభుత్వ పశువైద్యశాలను నిర్మించారు. 1978లో గూడూరు సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. తమకున్న ఆస్తులను ప్రజల కోసం ఖర్చుచేసిన ఉదారస్వభావి పెంచలరెడ్డి. ఆయన మృతికి నివాళు లర్పిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### కాటంరెడ్డి కోదండరామిరెడ్డి



అల్లూరు మాజీ సర్పంచ్, అందరూ ఆత్మీయంగా 'పెద్దబ్బయ్య' అని పిలుచుకునే మంచి మనిషి కాటంరెడ్డి కోదండరామిరెడ్డి మార్చి 6వ తేదీన స్వర్గస్తులయ్యారు. ఆయన వయసు 72 సంవత్సరాలు. ఆయన భార్య సులోచనమ్మ కొంతకాలం క్రితం కన్నుమూశారు. ఆ దిగులుతోనే కోదండరామిరెడ్డి అనారోగ్యం పాలయ్యారు. కోదండరామిరెడ్డిది తొలినుంచి ముక్కుసూటి మనస్తత్వం, ఏ విషయాన్నైనా కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం ఆయన నైజం. అయితే, మాట గట్టిదైనా..మనసు మెత్తన. జమీందారి వంశంలో జన్మించిన కోదండరామిరెడ్డి అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తాతగారి సోదరుని కుమారుడు. కోదండరామిరెడ్డి ఆల్లూరు మేజర్ పంచాయతీకి సుమారు పదేళ్ళపాటు అనితరసాధ్యమైన రీతిలో సేవలందించి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల ప్రశంసలు పొందారు. అంతేకాదు అప్పట్లో ఆయన మంచి పేరున్న రైతు నాయకుడు కూడా. కోదండరామిరెడ్డి మృతితో వారి కుటుంబం శోకతప్తమైంది. ఈనెల 18వ తేది బుధవారం అల్లూరులోని వారి స్వగృహంలో ఉత్తరక్రియలు జరుగుతాయి. కోదండరామిరెడ్డి మృతికి విచారం వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్'!..

### పాలిచర్ల ఫణిప్రసన్నరెడ్డి



నెల్లూరు పొదలకూరురోడ్డులోని నెల్లూరు క్లబ్ అధ్యక్షులు పాలిచర్ల ఫణిప్రసన్నరెడ్డి ఈనెల 10వ తేదీన స్వర్గస్తులైనారు. ఆయన వయసు 65 సంవత్సరాలు బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు ఆయన స్వగ్రామం. ఆయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఫణిప్రసన్నరెడ్డి గతంలో నెల్లూరు క్లబ్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఇటీవలే నెల్లూరు క్లబ్‌లో జరిగిన ఎన్నికలలో ఆయన అధ్యక్షుడుగా ఎన్నిక కావడం జరిగింది. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది లాయర్.

### మోచర్ల రమణారెడ్డి



ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాలెం గ్రామానికి చెందిన రైతు కుటుంబీకుడు మోచర్ల రమణారెడ్డి ఈ నెల 5వ తేదీన కన్నుమూశారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు వున్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా ఆనం అరుణమ్మ



నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఎవరు కాబోతున్నారన్నది దాదాపు ముందుగానే ఖాయమైపోయింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి సతీమణి శ్రీమతి ఆనం అరుణమ్మ జడ్పీ ఛైర్ పర్సన్ కావడం లాంఛనమేనని తెలుస్తోంది. ఆనం అరుణమ్మ ఎన్నికకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆమెకు లైన్ క్లియర్ అయినట్లే!

నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ పదవి ఈసారి జనరల్ కోటాలో మహిళలకు రిజర్వ్ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో పలువురు నాయకుల సతీమణులు, కుమార్తెల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఎంపీలు, ఎమ్మెల్యేల కుటుంబసభ్యులకు స్థానిక ఎన్నికల పదవులు ఇచ్చేది లేదని సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముందుగానే చెప్పడంతో.. వారి ఆశలకు షట్టర్ దించినట్లయ్యింది.

ఈ నెల 10వ తేదీన వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో జడ్పీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిపై చర్చ జరిగినప్పుడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డే ఆమె పేరును ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఆనం విజయకుమార్‌రెడ్డి డీసీసీబీ ఛైర్మెన్‌గా వున్న నేపథ్యంలో ఒకే కుటుంబంలో రెండు పదవులపై తర్జన భర్జన జరిగింది. అయితే ఆనం విజయకుమార్‌రెడ్డికి వున్న డీసీసీబీ ఛైర్మెన్ పదవి తాత్కాలికం, దానికి ఎప్పుడు ఎన్నికలు పెడతారో తెలియదు, దానికంటే జడ్పీ ఛైర్‌పర్సన్ పదవి ఇంకా పెద్దది, 5ఏళ్లు వుంటుంది. అదీగాక శాసన మండలిని రద్దు చేయడం వల్ల ఆనం విజయకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశాలు కూడా లేవు. కాబట్టి జడ్పీ ఛైర్మెన్ పదవిని వారికి ఇవ్వడానికే ముఖ్యమంత్రి అంగీక రించినట్లు తెలుస్తోంది. ఈ కోణంలోనే ఆమె నెల్లూరురూరల్ జడ్పీటీసీ నుండి వైసిపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

### ఆనం కుటుంబం నుండి తొలి మహిళ

దాదాపు ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన ఆనం కుటుంబం నుండి ఇంతవరకూ మహిళలెవరూ రాజకీయాల్లోకి రాలేదు. మా కుటుంబం నుండి మహిళలు రాజకీయాల్లోకి రారని గతంలో మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి ప్రకటించి వున్నాడు కూడా!

అయితే ఇప్పుడు కాలం మారింది. అప్పట్లో రాజకీయాలలో మహిళలకు పెద్దగా అవకాశముండేది కాదు. కాని ఇప్పుడు సగం సీట్లు మహిళలకే! అదీగాక ఆనం కుటుంబంలో సుదీర్ఘ కాలంగా సేవలు చేసి, ఎలాంటి పెద్ద పదవులు పొందని నాయ కుడు ఆనం విజయకుమార్‌రెడ్డి. కష్టకాలంలో వైసిపిలోకి వచ్చి, ఆ పార్టీకి నమ్మకస్థుడిగా మారాడు. చిత్తశుద్ధితో పని చేస్తున్నాడు. ఆయన చిత్తశుద్ధిని గౌరవించే ఈరోజు జడ్పీ ఛైర్మెన్ బాధ్యతను 'ఆనం' దంపతులకు ఇవ్వాలని నిర్ణయించారు.

# ఖాళీ అవుతున్న 'దేశం'

(మొదటి పేజీ తరువాయి)

కాలం మారింది. పరిస్థితులు మారాయి. ఇప్పటి నాయకులు ఒకరోజు అధికారంలో లేకుంటేనే విలవిల్లాడుతున్నారు. అలాంటిది ఐదేళ్లు, పదేళ్లు ప్రతిపక్షంలో వుండి పోరాటాలు చేసే సత్తా వీరికెక్కడొస్తుంది.

ఐదేళ్ల క్రితంవరకు కూడా రాష్ట్ర రాజకీయాలలో కొంత హుందాతనాన్ని, విలువలను పాటించేవాళ్ళు. అధికారంలో వుండి ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీలో నిలబడి వుండే వాళ్ళు. గత ఐదేళ్ల నుండి రాష్ట్ర రాజకీయాలు పూర్తిగా కలు షితమయ్యాయి. వీటికి శ్రీకారం చుట్టింది మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే కావడం గమనార్హం.

2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నీతి నియమాలను, విలువ లను తుంగలో తొక్కి నిర్లజ్జగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ వైసిపి నుండి గెలిచిన ముగ్గురు ఎంపీలను, 23మంది ఎమ్మెల్యేలను వారి పదవులకు రాజీనామాలు చేయించకుండానే టీడీపీ లోకి తీసుకున్నాడు. ఇలాంటి నీచరాజ కీయాలు గతంలో ఎప్పుడూ లేవు. రాజ కీయాలలో ఒక దుష్ట సంస్కృతికి చంద్ర బాబే అంకురార్పణ చేసినట్లయ్యింది.

అప్పుడు చంద్రబాబు పాలనలో జరి గిందే ఇప్పుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలోనూ జరుగుతోంది. కాకపోతే ఇద్దరికీ విలువలలో తేడా! వైసిపి తరపున గెలిచినోళ్లను చంద్రబాబు రాజీనామాలు చేయించకుండానే తన పార్టీలోకి తీసు కుంటే, జగన్ మాత్రం వైసిపిలోకి రావా లనుకుంటున్న ఇతర పార్టీలలోని నాయ కులను వారికున్న పదవులకు రాజీనామాలు చేశాకే తీసుకుంటున్నాడు.

ఈ 9 నెలల కాలంలోనే పలువురు ఎమ్మెల్యేలు టీడీపీని వీడారు. ఇప్పుడు ఇంకా జోరుగా టీడీపీ నుండి వైసిపిలోకి వలసలు మొదలయ్యాయి. డొక్కా మాణిక్యవరప్రసాద్, రెహమాన్‌లు ఇటీవలే వైసిపిలో చేరారు. అన్నింటిని మించి కడప జిల్లాలో టీడీపీకి పెద్ద షాక్ తగిలింది. తెలుగుదేశం ఆవిర్భావం నుండి ఆ పార్టీ లోనే కొనసాగుతున్న జమ్మలమడుగు మాజీఎమ్మెల్యే పి.రామసుబ్బారెడ్డి టీడీపీకి గుడ్‌బై చెప్పి వైసిపిలో చేరాడు. ఇంతకంటే చంద్రబాబును షాక్‌కు గురిచేసేది పులి వెందుల ఇన్‌ఛార్జ్ సతీష్‌రెడ్డి పార్టీని వీడడం. పాతికేళ్ల నుండి పులివెందులలో నిలబడి ఆయన వైయస్ కుటుంబంతో పోరాడుతున్నాడు. చంద్రబాబును నమ్ము కుని ఇక పార్టీలో వుంటే కష్టమని భావించి వైసిపిలో చేరుతున్నాడు. జమ్మలమడుగుకు చెందిన మరో నాయకుడు దేవగుడి నారా యణరెడ్డి కూడా వైసిపిలో చేరుతున్నాడు. కనిగిరి మాజీఎమ్మెల్యే కదిరి బాబూరావు వైసిపిలో చేరిపోయాడు. టీడీపీకి అన్నింటి కంటే పెద్ద షాక్ చీరాల ఎమ్మెల్యే కరణం బాలరామ్. ఆయన టీడీపీకి రాజీనామా చేశాడు. వైసిపిలో చేరబోతున్నాడు. ఇప్ప టికే టీడీపీ నుండి కొందరు వైసిపిలోకి, ఇంకొందరు బీజేపీలోకి వెళ్లారు. మిగిలిన వాళ్ళు ఎవరికి నచ్చిన పార్టీలోకి వాళ్లు వెళ్లే అవకాశముంది. ఆ తర్వాత 'దేశం' దుకాణం కట్టేయడమే మిగిలి వుంటుంది.

# అంగరంగ వైభవంగా రంగనాథుడి రథోత్సవం



నెల్లూరు రంగనాయకులపేట శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న శ్రీదేవీ భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. దేవేరులతో కొలువైన స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజన సందోహంతో తల్పగిరీశుడి మాడవీధులు కిట కిటలాడాయి. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యలు, నిషింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్య హోమం, మహానివేదన, బలిహరణం తదితర విశేష పూజలు నిర్వహించారు. రథోత్సవంలో రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, వైయస్సార్ సీపీ నాయకుడు రూప్‌కుమార్‌యాదవ్, ఇఓ డి. వెంకటేశ్వర్లు, ఛైర్మన్ కోట గురుబ్రహ్మం పాల్గొని రథోత్సవం సాఫీగా సాగాలని కోరుకుంటూ గుమ్మడికాయతో దిష్టి తీసి ప్రారంభించారు. రథోత్సవం తూర్పు వున్న గోపురం వీధిలోని రైల్వే గేటు వరకు, అక్కడి నుండి గోపురంవీధి, రంగనాయకులపేట, సంత పేట, నాలుగుకాళ్ళ మండపం వరుకు చేరుకుని మరలా అక్కడ నుండి రథ మండపానికి చేరు కుంది. తొలుత కరోనా వైరస్ వదంతుల నేప థ్యంలో రథోత్సవాన్ని తూర్పు గోపురం వీధి వరకే అధికారులు పరిమితం చేశారు. కాని భక్తులు మనోభావాల దృష్ట్యా రథోత్సవాన్ని కొనసాగిం చారు. దీంతో రథోత్సవం కొంత ఆలస్యమైంది. ఈనెల 4 వ తేదీన అంకురార్పణతో ప్రారంభమైన రంగనాథుని బ్రహ్మోత్సవాలు 5న శేష వాహన ఉత్సవం, 6న హంసవాహనోత్సవం, 7న సింహ వాహనం, 8న హనుమంతసేవ, 9న మోహినీ అవతారం, బంగారు గరుడసేవ, 10 న కల్యాణోత్సవం, గజవాహనసేవలు నేత్రపర్వంగా జరిగాయి. ఈ ఉత్సవాలు ఈనెల 15వ తేది జరిగే తెప్పోత్సవంతో ముగుస్తాయి.



## ఆపదల్లో ఉన్నవారిని..

# ఆదుకునేందుకే 'దిశ' యాప్

**- జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు**

ఆపదల్లో ఉన్నవారిని ఆదుకునేందుకే 'దిశ' యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చామని, 'దిశ' చట్టంతో మహిళలకు, చిన్నారులకు సంపూర్ణమైన రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అన్నారు.

ఈనెల 8న నెల్లూరులోని జిజిహెచ్ ఆవరణంలో 15 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన 'దిశ' పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు, బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు ప్రభుత్వం 'దిశ' చట్టాన్ని రూపొందించిందన్నారు. మహిళా దినోత్సవం రోజునే దిశ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటుచేయడం, అందుకు ఎస్పీ భాస్కర్‌భూషణ్ తగు శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది అందరూ మహిళలు, చిన్నారుల రక్షణలో రాష్ట్రప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ ఈ పోలీస్‌స్టేషన్లో ఇద్దరు డిఎస్పీలతో పాటు ఇద్దరు ఎస్‌ఐలు, 34 మంది సిబ్బంది ఉన్నారని, ఇంకా పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం జరుగుతుందని చెప్పారు. వీరంతా 24గంటలూ పనిచేసేవిధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా మహిళలపై అన్యాయాలు, అఘాయిత్యాలు జరిగితే వెంటనే 100, 121, 181 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి బాధితుల రక్షణకు సత్వర చర్యలు తీసుకుంటారన్నారు. త్వరలోనే ఇక్కడ ఫాస్ట్‌ట్రాక్ కోర్టును కూడా ఏర్పాటుచేస్తారన్నారు. డిఎల్ఎస్ఎ కార్యదర్శి పి.జె సుధ మాట్లాడుతూ దిశ చట్టం ద్వారా నిందితులకు వెంటనే శిక్షపడుతుందన్నారు. ఈ భయంతోనే నేరాలు తగ్గుతాయన్నారు. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన దిశ చట్టం దేశానికి దిశానిర్దేశం చేస్తుందన్నారు. అనంతరం శక్తి బృందం మహిళలకు పంపిణీచేసిన బుల్లెట్ వాహనాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జేసి-2 కమలకుమారి, ఏఎస్పీలు పి.వెంకటరత్నం, పి.మనోహర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు టోపీ పెట్టిన వైసిపి

**- మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం**



స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో వైకాపా ప్రభుత్వం చిత్తం వచ్చిన రీతిగా వ్యవహరిస్తోందని, రిజర్వేషన్ల విషయంలో చాలా దారుణంగా వ్యవహరిస్తూ బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 8న ఆయన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు రావాల్సివుంటే 10.6 శాతంతో సరిపెట్టారని, 16 మండలాల్లో బీసీలకు ఒక్క ఎంపీటీసీ స్థానాన్ని కూడా కేటాయించలేదని చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీపీ స్థానాన్ని బీసీలకు రిజర్వ్ చేసి ఒక్క ఎంపీటీసీ స్థానాన్ని కూడా బీసీలకు ఇవ్వలేదన్నారు. 2014లో 166 ఎంపీటీసీ స్థానాలను బీసీలకు కేటాయిస్తే ప్రస్తుతం ఆ సంఖ్యను 60కి పరిమితం చేశారని ఆయన విమర్శించారు. బీసీలకు 10 శాతం సీట్లు పార్టీ తరపున ఇస్తామని జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారని, అయితే ఆయన దయాదాక్షిణ్యాలు ఎవరికీ అవసరం లేదని, చట్టప్రకారం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని అన్నారు. బీసీలు కూడా జనరల్ స్థానాల్లో పోటీ చేయవచ్చని చట్టమే చెప్తోందని, ప్రత్యేకంగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చేదేమిటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల షెడ్యూలు, నోటిఫికేషన్ విడుదల విషయంలోనూ ఎన్నికల కమిషన్ విచిత్రంగా వ్యవహరిస్తోందని, ఎన్నికల ప్రక్రియ అంతా జగన్మోహన్‌రెడ్డి కనుసన్నల్లో నడుస్తోందని ఆయన ఆరోపించారు. వైకాపా తీరుపై ప్రజలు తిరుగుబాటు చేసి తగు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అన్ని స్థానాల్లోనూ పోటీచేసి విజయం సాధిస్తుందని ఆయన ఆకాంక్షించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గెలుపు పరిపూర్ణం కావాలి

**ఇన్‌ఛార్జి మంత్రి బాలినేని**



నెల్లూరు జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి అభ్యర్థుల గెలుపు పరిపూర్ణం కావాలని, నూరు శాతం ఫలితాలు మన వైపే ఉండాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

ఈనెల 10వ తేదీన నెల్లూరులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూరు శాతం సీట్లను వైసిపి కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణలో మద్యం, నగదు పంపిణీ లేకుండా చూడాలన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదర్శాలను నిలబెట్టాలని పిలుపునిచ్చారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలోని రెండు ఎంపీ సీట్లు, 10 ఎమ్మెల్యే సీట్లు వైసిపి కైవసం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ.. స్థానిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా నెల్లూరు జిల్లాలో వైసిపి ఎంతో పటిష్టంగా ఉందని చెప్పారని, ఆయన నమ్మకాన్ని మరోసారి నిలబెట్టాలని అన్నారు. గత తొమ్మిదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ టిక్కెట్ల కేటాయింపులో పెద్దపీట వేసినట్లు చెప్పారు. బీసీలకు అదనంగా 10శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఆ వర్గం ప్రజల పట్ల ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి తనకున్న అభిమానాన్ని చాటుకున్నారని జగన్ మాటల మనిషి కాదు చేతల మనిషి అనడానికి ఇదే నిదర్శనమన్నారు.

అంతకుముందు మంత్రి జిల్లా వైసీపీ నాయకులు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, తిరుపతి ఎంపి బల్లి దుర్గా ప్రసాదరావు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం రాంనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, వి.వరప్రసాద్, డిసిసిబి ఛైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీదా మస్తాన్‌రావు, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు శ్యాం ప్రసాద్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వీరి చలపతి రావు, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులతో సమావేశమై స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన చర్చించారు.

# వైసీపీలో చేరిన మనోజ్



వాకాడు మాజీ ఏఎంసీ ఛైర్మన్ పాపారెడ్డి మనోజ్‌కుమార్ రెడ్డి సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి సమక్షంలో ఆయన వైసీపీలో చేరడం జరిగింది. మనోజ్‌కుమార్‌రెడ్డిని పార్టీ కండువా కప్పి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు కూడా పార్టీలో చేరారు.

# తెలుగు భాష గొప్పతనాన్ని నలుదిశలా చాటాలి

**- తెలుగు రాతప్రతుల సదస్సులో వక్తల పిలుపు**



తెలుగు భాష గొప్పతనాన్ని నలుదిశలా చాటాలని, అందుకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రంలో తెలుగు రాతప్రతుల పద్ధతులపై వారం రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ఈనెల 8న ముగిసింది. ఈ శిక్షణా శిబిరానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాక పలు రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 40 మందిని ఎంపిక చేయగా, వీరిలో 32 మంది హాజరయ్యారు.

ఈ సందర్భంగా అధ్యయన కేంద్రం డైరెక్టర్ మునిరత్నంనాయుడు మాట్లాడుతూ ప్రాచీన తెలుగుభాషను అధ్యయనం చేసేందుకు ఇక్కడ భవిష్యత్తులో డిప్లొమా కోర్సులు, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. వక్తలు మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా తెలుగు భాషను మాత్రం ఎప్పుడూ మర్చిపోకూడదని అన్నారు. నెల్లూరుకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రాన్ని తీసుకురావడం వల్ల తెలుగుభాషకు ఎంతో ప్రయోజనం ఉందని, ఈ కేంద్రం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. తెలుగు అభివృద్ధికి కృషి చేసేందుకు మేధావులు, కవులు, ప్రముఖులంతా కృషిచేయాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. ప్రముఖ పరిశోధక పండితులు ఆర్వీఎస్ సుందరం మాట్లాడుతూ తెలుగుభాష ప్రపంచ భాషగా అభివృద్ధి చెందేందుకు అందరూ కృషిచేయాలన్నారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఆచార్యులు బూదాటి వెంకటేశ్వర్లు, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తెలుగు భాషాభిమానులు పాల్గొని తెలుగుభాష విశిష్టతను వివరించారు. అనంతరం వీరందరినీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ మునిరత్నంనాయుడు శాలువాలతో సత్కరించి గౌరవించారు.

# నెల్లూరు జిల్లా ఎన్నికల పరిశీలకునిగా బసంత్!

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 13 జిల్లాలకు ఇన్‌ఛార్జులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించిన ఉత్తర్వుల్లో ఈనెల 10న కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ ఎన్నికల సంఘం మరో ఉత్తర్వును జారీ చేసింది. మొదటగా నెల్లూరు జిల్లా పరిశీలకునిగా కేటాయించిన బి.రామారావును శ్రీకాకుళం పరిశీలకునిగా మార్పు చేశారు. ఆయన స్థానంలో జిల్లా పరిశీలకునిగా పి.బసంత్‌కుమార్‌ను నియమించారు. ఆయన ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవోగా పనిచేస్తున్నారు.



# ఉత్తరక్రియలు

మా తండ్రిగారైన

**మోచర్ల రమణారెడ్డి గారు**

తే.5.03.2020ది

గురువారం స్వర్గస్థులైనారు.

వారి పవిత్రాత్మకు

శాంతి కలుగాలని ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు

మోచర్ల సుధాకర్‌రెడ్డి - ప్రమీలమ్మ

తమ్ముడు - మరదలు

మోచర్ల ఆదిశేషారెడ్డి - ప్రమీలమ్మ

కుమార్తెలు - అల్లుళ్ళు

సన్నపురెడ్డి శైలజ - కీ॥శే॥ విజయకుమార్‌రెడ్డి

సన్నపురెడ్డి అనిత - వేణుగోపాలరెడ్డి

తమ్ముని కుమారుడు - కోడలు

మోచర్ల రవికుమార్‌రెడ్డి - లలిత

తమ్ముని కుమార్తె - అల్లుడు

సిద్దన శ్రీలత - శ్రీనివాసులురెడ్డి

మనుమలు - మనుమరాళ్ళు

నెల్లూరు దిలీప్‌కుమార్‌రెడ్డి - కీ॥శే॥ కవిత

గుండ్రా సతీష్‌రెడ్డి - సరిత

మోచర్ల మదన్‌కుమార్‌రెడ్డి - మాధురి

ఏలూరు హరీష్‌కుమార్‌రెడ్డి - అపర్ణ

సన్నపురెడ్డి కృష్ణకిషోర్‌రెడ్డి - బ్రిజల

సన్నపురెడ్డి వెంకట జతిన్

సిద్దన కృష్ణలేఖ్య

మోచర్ల షలోమ్

మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

హస్వంత్, మాహ్యశ్రీ, సాయి ఉత్కర్ష్, పూజిత, కనిష్క, ధన్వి, విష్ణువర్ధన్, ధనుష్

**ఉత్తరక్రియలు: తే.19.03.2020ది గురువారం ఉ. 10గం.లకు నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలం, ముదివర్తిపాలెంలోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.**

# ఉత్తరక్రియలు



తన మంచితనంతో మా అందరి హృదయాలలో

సుస్థిరస్థానం ఏర్పరచుకొన్న మంచి మనిషి

**శ్రీ కాటంరెడ్డి కోదండరామిరెడ్డి గారు**

మాజీ సర్పంచ్, అల్లూరు.

తేది. 06.03.2020 శుక్రవారం స్వర్గస్తులైనారు.

వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

తమ్ముళ్ళు :

కాటంరెడ్డి వీరబాబులరెడ్డి - సీతమ్మ

కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి - శివప్రియ

కుమార్తెలు - అల్లుళ్ళు :

అనిత - ఓడూరు వెంకటేశ్వర్లురెడ్డి

అపర్ణ - ఉచ్చూరు వంశీధర్‌రెడ్డి

మనుమరాళ్ళు : గిరీష, సంజన

**ఉత్తరక్రియలు :** వారి పెద్దకర్మ తేది. 18-03-2020 బుధవారం నెల్లూరుజిల్లా, అల్లూరులోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



**కందలి పెంచలరెడ్డి**

జననం : 23.05.1936 మరణం : 09.03.2020

# ఉత్తరక్రియలు

విద్యావంతుడు, సౌమ్యశీలి, దయార్థ హృదయుడు

**కందలి పెంచలరెడ్డి, B.A**

మాజీ సమితి అధ్యక్షులు, గూడూరు, తాలూకా.

తే. 09.03.2020ది సోమవారం పరమపదించారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : కందలి సులోచనమ్మ

మేనల్లుడు : అల్లూరు చంద్రశేఖర్‌రెడ్డి

RTO, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

సెల్ : 9848528367

**ఉత్తరక్రియలు :**

వారి ఉత్తరక్రియలు మార్చి 18, 2020, బుధవారం, గూడూరు మండలం, తిప్పవరప్పాడు గ్రామంలోని వారి స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com